కర్నూలు | నంద్యాల
వార్త
26 అక్టోబర్ 2025 ఆదివారం పేజీలు 4

## తుంగభద్రకు భారీగా.. ఇన్‌ఫ్లో..!

- తుంగభద్రకు భారీగా చేరుతున్న వరదనీరు
- 80 టీఎంసీలు దాటడంతో దిగువకు నీరు విడుదల చేసే ఆలోచనలో అధికారులు

**హాలహర్వి, అక్టోబరు25, ప్రభాతవార్త;** ఉభయ జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తింది. జలాశయానికి ఇన్ ఫ్లో పెరుగుతుండడంతో జలాశయం గేట్లు దిగువకు ఎత్తే ఆలోచనలో అధికారులు ఉన్నారు. తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు. అయితే క్రస్ట్ గేట్లు పరిస్థితి నేపథ్యంలో జలాశయంలో 80 టీఎంసీల నిరు నిల్వ చేయాలని సేఫ్టీ నిపుణుల కమిటీ సూచించిన సంగతి తెలిసిందే. నీటి నిల్వ 80 టీఎంసీలకు చేరడంతో నీరు దిగువకు వదలాలని అధికారులు భావిస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి నీటి లెక్కల కొలతల ప్రకారం



21.697 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరింది. భద్ర, తుంగ జలాశయం నుంచి అలాగే వరద రివర్ నుంచి జలాశయానికి నీరు పెరుగుతున్నాయి. శనివారం గానీ, ఆదివారం గానీ దిగువకు నీరు విడుదల చేస్తామని డ్యాం అధికారులు తెలిపారు.



## బస్సు ప్రమాదం..
## నిశ్శబ్ద జ్ఞాపకం..!

కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంపై..
ఎమ్మిగనూరుకు చెందిన కదిరికోట ఆదెన్న కలం నుండి..
జారిన కన్నీటి సుదులు..

- నిన్నటి వరకు వారు మనుషులు..
- జీవితం పైన ఆశలతో నిండిన వారు..
- ఇంటి వాళ్లకు 'వచ్చేస్తా' అని చెప్పి..
- మరల కనిపించని దారిలో మాయమయ్యారు..
- ఆ బస్సు చక్రాలు గమ్యాన్ని చేరలేకపోయాయి..
- ఒక మోటర్ శబ్దం ఆపేసింది ప్రాణాల పయనాన్ని..
- కలలతో బయలుదేరిన ఆ పాదాలు..
- బూడిదగా మారి నిలిచిపోయాయి..
- మంటల్లో కరిగి పోయింది మానవత్వం..
- ధగధగలలో దాచుకుంది వారి బాధ..
- అరుపులు ఆగిపోయిన తరువాత,,
- కన్నీళ్లు మాత్రమే మిగిలాయి ఆ మార్గంలో..
- తల్లి ఎదురు చూస్తుంది కిటికి తలుపు వైపు..
- బిడ్డ పరిగెడుతుంది తండ్రి పేరు పిలుస్తూ..
- కానీ తిరిగి రారు వారు..

తిరిగి వస్తుందో ఆ 'జ్ఞాపకం' మాత్రమే..
వారి ఆత్మలు వెలుగులా నిలవాలి..ఆత్మలకు శాంతి కలగాలి..

## ప్రమాదానికి.. అసలు కారణం..?



బస్సు దగ్ధం సంఘటనలో డ్రైవర్ల తప్పు లేదా.. కేవలం బైకర్ తప్పు మాత్రమే ఉందా.. అనే విషయం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. బైక్ ను బస్సు ఢీకొనలేదని.. అప్పటికే బైక్ స్కిడ్ అయి రోడ్డుపై పడి ఉందని.. కర్నూలు జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. దీంతో తప్పంతా బైకర్ దే అనే కోణంలో చర్చ జరుగుతోంది. బైక్ ను గమనించకుండా డ్రైవ్ చేయడం డ్రైవర్ తప్పు కాదా అని చర్చ మరోవైపు ప్రారంభమైంది. రోడ్డుపై పడి ఉన్న బైక్ ను ఢీ కొట్టిన వెంటనే బస్సు ఆపకపోవడం అసలు తప్పు కాదా అంటున్నారు. బయట పైకి దృష్టి మరలచడం ట్రావెల్స్ యాజమాన్యాన్ని కాపాడే ప్రయత్నమేనని ప్రజా సంఘాలు అంటున్నాయి. వి కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధం కేసులో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

- స్కిడ్ కావడంతో.. రోడ్డుపై పడి ఉన్న బైక్
- రోడ్డుపై పడి ఉన్న బైకును గుర్తించని బస్సు డ్రైవర్
- బైక్ ను ఢీకొట్టానని తెలిసినా.. బస్సు ఆపని నిర్లక్ష్యం
- వెంటనే బస్సు ఆపి ఉంటే... మంటలు వచ్చేవి కావు
- 300 మీటర్లు ఈడ్చుకెళ్లడంతోనే మంటలు
- తప్పంతా బైకర్ పై నెట్టే ప్రయత్నం ..
- కావేరి ట్రావెల్స్ ని కాపాడే ప్రయత్నమా..
- బైకర్ మద్యం తాగాడంటున్నారు
- లొంగిపోయిన డ్రైవర్లకు.. డ్రంక్ టెస్ట్ చేయించారా..





**కర్నూలు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** శుక్రవారం తెల్లవారుజామున బస్సు మంటల్లో దగ్ధం కావడంతో 19 మంది సజీవ దహనమయ్యారు. అక్కడే బైక్ శివశంకర్ కూడా చనిపోయాడు. ఈ సంఘటనపై మొదట్లో రోడ్డుపై వెళ్తున్న బైకును బస్సు ఢీకొందన్నారు. ఆ సంఘటనలో బైక్ బస్సు కిందకు వెళ్లిపోయిందని, సుమారు 300 మీటర్లు బైక్ ను బస్సు ఈడ్చుకెళ్ళిందన్నారు. తద్వారా మంటలు వేగాయని చెప్పారు. అయితే శనివారం రోజుకి ఆ విషయంలో కొంత మార్పు జరిగింది. ప్రమాదం జరగడానికి కారణం రోడ్డుపై బైక్ పడి ఉండడమేనంటున్నారు.

కర్నూలుకు చెందిన శివశంకర్ అతని మిత్రుడు ఎర్రి స్వామి బస్సు ప్రమాదానికి కొద్దిసేపు ముందు అదే రోడ్లో వెళ్తూ బైక్ స్కిడ్ అయ్యి కింద పడ్డారు. ఆ ప్రమాదంలో శివశంకర్ మాత్రం అక్కడికక్కడే మృతి చెందాడని, ఎర్రి స్వామి స్వల్ప గాయాలతో బయటపడ్డాడని పోలీసులు ప్రకటించారు. ఆ క్రమంలో శివశంకర్ రోడ్డు పక్కన పడ్డాడని, బైక్ మాత్రం నడిరోడ్డులో పడిందని తెలిపారు. శివశంకర్ మృతి చెందాడని గుర్తించిన ఎర్రి స్వామి, తర్వాత బైకును పక్కకు తీద్దామనుకున్నాడు. అప్పటికే వి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్ పై నుంచి వెళ్ళింది. సుమారు 300 మీటర్లు బైకును లాకెళ్ళింది. దీంతో మంటలు చెలరేగాయి. మంటలు చూసిన ప్రత్యక్ష సాక్షి మృతుడు శివశంకర్ మిత్రుడు ఎర్రి స్వామి అక్కడి నుండి పారిపోయాడు. ఈ విషయాన్ని బట్టి బస్సు డ్రైవర్ తప్పు లేదని బైక్ రోడ్డుపై పడడమే తప్పనే విధంగా చర్చ ప్రారంభమైంది. అయితే ఈ విషయంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రోడ్డుపై బైక్ పడి ఉంటే.. బస్సు ఆపడం.. లేదా పక్క నుంచి వెళ్లాలి కదా.. అనే వాదన వినిపిస్తుంది. అయితే బస్సు ఉన్న అతివేగం కారణంగా ఆ రెండు పనులు చేయలేక బైక్ పై బస్సు ఎక్కించాడు అంటున్నారు. అయితే కేవలం బైకును మాత్రమే ఢీకొట్టాడా..

• వివరాలు 2లో



## కొనసాగుతున్న.. తుఫాన్..!

**అప్రమత్తంగా ఉండాలి : కలెక్టరు**

**నంద్యాల, అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి :** బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోని ఇంకా కొనసాగుతుండడంతో తుఫాన్ ఇంకా ముగిచలేదని జిల్లా కలెక్టరు రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 27,28,29 తేదిలో నంద్యాల జిల్లాకు బారీ వర్షపు సూచనలు ఉన్నాయని కలెక్టరు తెలిపారు. దీనితో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.ముఖ్యంగా వాగులు వంకలు వంతెనలు దాటే ప్రయత్నము చేయరాదని మొక్క జొన్న పంట కోతను వాయిదా వేయాలని పంటలను జాగ్రత్తంగా కాపాడుకోవాలని చెప్పారు. అలాగే మట్టి మిద్దెల కింద నివాసము ఉండరావద్దని అమె స్పష్టము చేవారు.





## టెట్ పాసైతేనే.. టీచరు కొలువు..!

- ఉపాధ్యాయులకు తప్పని అర్హత పరీక్ష..
- టెట్ నిబంధనలతో ఆందోళనలో ప్రభుత్వ టీచర్లు..
- ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లందరికి.. టెట్ పరీక్ష పాసవడం తప్పని సరి..

2లో

"ప్రతి ఏటా పరీక్షలను పెట్టి విద్యార్థులను టెన్షన్‌కు గురి చేసే ఉపాధ్యాయులు ఇప్పుడు టెట్ పరీక్ష టెన్షన్‌తో సతమత మవుతున్నారు. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన తరువాత ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది.ఇందులో భాగంగానే విద్యార్హతలతో పాటు వ్యక్తిలోని వృత్తి సామార్థ్యాన్ని పరీక్షించి నాణ్యమైన అభ్యర్థుల్ని ఉపాధ్యాయులుగానియమించాలని నిర్ధేశించింది.. ఈ సదుద్ధేశ్యంతోనే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీచర్ ఎలిజిబుల్ టెస్ట్) అంటే టెట్‌ను ప్రవేశపెట్టింది.. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యా యులందరికీ టెట్ పరీక్ష పాస్ అవడం తప్పదని తేల్చి చెప్పింది.. దీంతో ఉపాధ్యాయులగుండెల్లో టెన్షన్ మొదలైంది..టెట్ ఫెయిల్ అయితే తమ పరిస్థితి ఏమిటని బెంబేలెత్తుతున్నారు"..

**కోసిగి, అక్టోబరు 25, ప్రభాతవార్త :**

**టెట్ పరీక్షపై సుప్రీం కోర్టులో వ్యాజ్యం:**
గత కొన్ని ఏళ్లుగా టెట్ పరీక్షపై ఉన్నత న్యాయ స్థానాల్లో వ్యాజ్యలు నడుతుతూ ఈ టెట్‌ను రాయాల్సిన ఉపాధ్యాయులు ఈ టెన్షన్‌నుంచి తప్పించుకుంటు న్నారు.. కాగా ఇటీవల భారత సర్వోన్నత న్యాయస్థానం దీనిపై తుది తీర్పును వెలువరించింది.. ప్రభుత్వ ఉపాధ్యాయులంతా తప్పని సరిగా ఈ టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్(టీఈటీ)లో ఉత్తీర్ణత కావాల్సిందేనని తేల్చి చెప్పింది.. అంతేకాక2027 సంవత్సరం ఆగస్టు 31వ తేదీ లోగా ఈ తతంగం అంతా జరగాలని తేల్చేసింది.. కానీ ఐదేళ్లలోపు ఉద్యోగ విరమణచేసే ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చి మిగిలిన వారందరికీ ఈ టెట్ పరీక్ష నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది.. అలాగేనిర్ణీత గడువులోగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను ఉత్తీర్ణత కాకపోతే టీచర్ ఉద్యోగాన్ని వదులుకోవాలని కూడ హెచ్చరించింది..

**2010కి ముందు ఉన్న టీచర్లందరూ కూడా టెట్ రాయాల్సిందే:**
ఉపాధ్యాయ అర్హత పరీక్ష అనేది గత 2010 సంవత్సరం నుండే అమలులోకి వచ్చింది.. ఈ తరువాత నియమించబడిన టీచర్లుటెట్ పరీక్ష రాసి కొలువును సంపాదించుకున్నవారే.. అయితే అంతకు ముందు అంటే 2010వ సంవత్సరం కంటే ముందే టీచర్లనియామకాలు జరిగి ప్రస్తుతం ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తున్న వారెవరూ ఈ టెట్ పరీక్ష రాయలేదు.. దీంతో వీరిలో వృత్తిసామర్థ్యాలు తగినంతగా లేవన్న అభిప్రాయం ప్రభుత్వంలో నెలకుంది.. అయితే ఇప్పుడు వీరంతా ఈ టెట్ పరీక్ష రాయాల్సిందే..దీంతో 2010 కంటే ముందు ఉపాధ్యాయ కొలువు తెచ్చుకున్న వారందరు బెంబేలెత్తుతున్నారు..

## మొంథా తుఫాన్ .. జాగ్రత్త ..!

**: అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్**

**కర్నూలు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లాలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో తుఫాన్ నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొంథా తుఫాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో, ముఖ్యంగా కర్నూలు జిల్లాలో 27వ తేదీన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజర్వాయర్లు, చెరువులు, నదీతీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించి, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వ్యవసాయ, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, నీటిపారుదల, ఆరోగ్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. చెరువులకు గండ్లు పడకుండా, గట్లు బలహీనంగా ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించారు. రోడ్లు, వంతెనలు, కల్వర్టుల స్థితిని పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న వంతెనలను తక్షణమే మూసివేయాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ప్రజల భద్రత కోసం షెల్టర్ హోమ్స్, భోజనం, తాగునీటి ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. రేషన్ షాపుల ద్వారా అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచి, ప్రతి షెల్టర్‌లో హెల్ప్



డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖకు సంబంధించి డయేరియా, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా క్లోరినేషన్, ఫాగింగ్, స్ప్రే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అవసరమైన మందులు, చికిత్సా పరికరాలు సిద్ధంగా ఉంచి, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలని ఆమె తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల సంరక్షణ, పత్తి, ఉల్లి పంటల హార్వెస్టింగ్‌పై సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ రెస్క్యూ సిబ్బంది, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ల వద్ద జనరేటర్లు సిద్ధంగా ఉండేలా చూడాలని, పశుసంవర్ధక శాఖ అవసరమైన ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజల సమస్యలకు తక్షణ స్పందన ఇవ్వాలని, పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, స్కూల్ ఇన్స్పెక్షన్లు, కౌశలం కార్యకలాపాలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పనిలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చేపల వేటకు వెళ్లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, బీఎస్ఎన్ఎల్, ఎయిర్టెల్, జియో నెట్‌వర్క్ సమస్యలు తలెత్తకుండా సమన్వయం కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ పాండురంగయ్య, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, ఆర్అండ్‌బి ఎస్ఈ మహేశ్వరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, సిపిఓ భారతి, డిపిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 90 పైసలకే.. టన్ను ఇసుక లోడింగ్..!

- కర్నూలు ఇసుక టెండర్లలో పొలిటికల్ డ్రామా..
- నదుల వద్ద ఇసుకను లారీల్లోకి ఎత్తేందుకు టెండర్లు
- ప్రభుత్వ ధర రూ.45 రూపాయలు
- 90 పైసల నుంచి రూ.14 లోపు టెండర్లు దాఖలు
- టెండర్ దక్కించుకోవడమే.. లక్ష్యంగా ఎత్తుగడలు



ఒక టన్ను ఇసుకను లారీల్లోకి ఎత్తడానికి కేవలం 90 పైసలు సరిపోతుందని.. కర్నూలు జిల్లాలో ఇసుక కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఆ మేరకు అదే ధరకు టెండర్లు కూడా దాఖలు చేశారు. దీంతో అధికారులు నివ్వెరపోయారు. ఇది ఎలా సాధ్యం.. అసలు సాధ్యమే కాదు అంటున్నారు. అదే మరి ఇసుక మాఫియా మాయాజాలం..!

**కర్నూలు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక టన్ను ఇసుక లోడ్ చేయడానికి రూ.45 రూపాయలు ఖర్చవుతుంది. వాస్తవ లెక్కల ప్రకారం సుమారు రూ.100 ఖర్చవుతుంది. కానీ కేవలం 90 పైసలకే టన్ను ఇసుక లోడ్ చేస్తామని టెండర్లు దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కర్నూలు జిల్లాలో ఐదు ఇసుక రీచ్ ల నుంచి ఇసుకను ఉచితంగా అందిస్తున్నారు. అయితే లోడింగ్ కు మాత్రం నామమాత్రపు చార్జీలు వసూలు చేస్తారు. 18 టన్నుల లారీకి 800 లోపు మాత్రమే తీసుకుంటారు. తాజాగా జిల్లాలో మరో మూడు కొత్త ఇసుక రీచ్ లను ప్రభుత్వం గుర్తించింది. హులగుంద మండలంలో మొదటి మాగి అనే గ్రామ పరిధిలో ఒక ఇసుక రీచ్ ను, నందవరం మండలంలో గంగవరం గ్రామ పరిధిలో ఒక రీచ్ ను, నాగులదిన్నె గ్రామ పరిధిలో మరో రీచ్ ను ఏర్పాటు చేశారు. ఇసుకను వినియోగదారుల లారీల్లోకి ఎత్తేందుకు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లకు సంబంధించి మూడు ప్రాంతాల్లో మూడో వింత రేట్లు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం రూ 45 వరకు రేటు ప్రకటించింది. ఆ ధర కన్నా తక్కువ కానీ ఎక్కువ కానీ టెండర్లు వేయవచ్చు. అయితే ఒక రీచ్ లో ఇసుక లిఫ్టింగ్ చేయాలంటే.. ఇసుక రీచ్ వరకు కాంట్రాక్టర్ రోడ్డు వేసుకోవాలి. తర్వాత ఇసుక నింపేందుకు రెండు పెద్ద ప్రొక్లైనర్స్ ఏర్పాటు చేసుకోవాలి. వాటితో పాటు ఇసుకను కుప్పగా సేకరించినందుకు రెండు ట్రాక్టర్లు కావాలి. మరియు సుమారు పదిమంది రోజు కూలీలు కావాలి. వారి పైన సూపర్వైజర్లు, చలానాలు లెక్కలు చూస్తే అకౌంటెంట్ కావాలి. సక్రమంగా జరగాలంటే ప్రభుత్వం ఇచ్చిన రూ 45 రూపాయలు కూడా తక్కువే అవుతుంది. అయితే గంగవరం రీచ్ టెండర్లలో ఒకటన్ను ఇసుకను లోడ్ చేసేందుకు 90 పైసల ధరతో ఒకరు టెండర్ దాఖలు చేశారు. నాగులదిన్నె రీచ్ లో రూ.6.99 లకు లీస్ట్ టెండర్ దాఖలయింది. మొదటి మాగీ ఇసుక రీచ్ కు 13 రూపాయల కు టెండర్లు దాఖలయ్యాయి. ఆ ధరలకు లోడ్ చేయడం పూర్తిగా సాధ్యపడదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరి ఇక్కడ టెండర్ నిబంధనల ప్రకారము తక్కువ ధర కోట్ చేసిన వారికి టెండర్లు ఇవ్వాల్సి వస్తుంది. అయితే అంత తక్కువ ధరలో లాభాలు పొందడంలో అసలు వ్యవహారం ఏమిటనే విషయంపై ఆసక్తి నెలకొంది. ఈ టెండర్లపై రెండు మూడు రోజుల్లో అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

ధర ఏదైనా టెండర్ దక్కించుకోవడమే అసలు విషయంగా తెలుస్తోంది. టెండర్ దక్కించుకున్నాక తమ అర్థ, అంగ బలాలతో అధిక ధరలు రాబట్టుకుంటామనే ధీమా టెండర్దారులలో ఉందని, వారికి కొందరు నాయకుల అండదండలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి టెండర్ దారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే ప్రభుత్వ ఉచిత ఇసుక పథకానికి తూట్లు పడతాయని ఉంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చినప్పటికీ లోడింగ్ లో వేల రూపాయలు దండుకుంటారని చెబుతున్నారు. కావున ఈ విషయంలో అధికారులు సరైన నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు.



## శ్రీశైల మల్లన్న భక్తులకు.. చైర్మన్ తీపి కబురు

**: స్పర్శదర్శనం టికెట్ల భక్తులకు ఉచిత లడ్డు**



**శ్రీశైలం ప్రాజెక్టు,అక్టోబరు25, ప్రబాతవార్త :** శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు నూతన ధర్మకర్తల మండలి ఆధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు తీపి కబురు అందించారు.శనివారంనాడు ప్రభాతవార్తతో మాట్లాడారు. శ్రీశైల దేవస్థానం ధర్మకర్తలమండలి తొలి సమావేశం మండలి సభ్యుల,దేవస్థానం సిబ్బంది పరిచయంతో చాల మంచి వాతావరణంలో జరిగిందన్నారు.భక్తులకు కార్తికమాసం సందర్బంగా ఆధిక ప్రాధాన్యత ఇస్తూ శుక్ర,శని,ఆది,సోమవారాలలో స్పర్శదర్శనం రద్దుచేసి స్వామివారిని ఎక్కువ మంది భక్తులు దర్శనం చేసుకునే విధంగా అలంకారం దర్శనం మాత్రమే పెట్టడం జరిగిందని చెప్పారు.మిగత మూడు రోజులు స్పర్శదర్శనం పెట్టడం జరిందని అన్నారు.కార్తిక లక్షదీపోత్సవ కార్యక్రమం ప్రతి సోమవారం పుష్కరిణి దగ్గర జరుగుతుందన్నారు.ఈ ఏడాది గంగధర మండపం నుండి నందిమండపం వరకు కోటి దీపోత్సవం కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు.బోర్డు తొలి సమావేశంలో ముఖ్యంగా రూ.500/-ల స్పర్శదర్శనం చేసుకోనే ప్రతి భక్తుడికి ఉచితంగా లడ్డు ప్రసాదం ఇవ్వాలని తీర్మాణం చేసామన్నారు.అలాగే స్వామివారి సేవకు వచ్చే శివసేవకులకు మంచి వసతి సౌకర్యం కల్పించాలని నిర్ణయించామని తెలిపారు.స్వామిఅమ్మవార్ల దర్శనార్థమై వచ్చి తిరిగి వెళ్లే ప్రతి భక్తుడికి అమ్మవారి గుడి వెనుక వైపున నిరంతరం వారికి ప్రసాదం ఇవ్వాలని కూడా తీర్మాణం చేయడం జరిగిందని అన్నారు.మొదటి సమావేశం కనుక ప్రాధమిక విషాయాలపైన అలాగే మాస్టర్‌ప్లాన్ గురించి కూడా సభ్యులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.రాబోయే రోజుల్లో ఆలయం ఎలా ఉంటుంది,దానికి కావలసిన వసతులు,దానికి సంబందించిన బడ్జెట్టు,ఆలయ వ్యయం,ఖర్చుల గురించి కూడా చర్చించడం జరిగిందన్నారు.ధర్మకర్తల మండలి ఆలయ అభివృద్ధి,భక్తుల సౌకర్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం జరుగుతుందన్నారు.

# కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరతో రైతులకు భరోసా, ఆదోనిలో సిసిఐ సిద్ధం

**: ఎమ్మెల్యే పార్థసారథి**



**ఆదోని, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సిసిఐ) ద్వారా 2025-26 పత్తి సీజన్ ప్రారంభమవుతుందని, రైతు సోదరులు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువకు తమ పత్తిని అమ్ముకూడదని విజ్ఞప్తి చేశారు. రైతులు సి.సి.ఐ. ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దే పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు.రైతులు తమ పత్తిని కపాస్ కిసాన్ యాప్ ద్వారా ముందుగా నమోదు చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని, ఇప్పటికే ఈక్రాప్ లో నమోదు చేసుకున్న వారు తమ ఆధార్, పట్టాదారు పాస్ బుక్ ప్రతులతో సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేటప్పుడు శుభ్రమైన, తేమశాతం 8 నుండి 12 శాతం మధ్యలో ఉన్న నాణ్యమైన పత్తిని మాత్రమే తీసుకురావాలని అన్నారు, ప్లాస్టిక్ సంచుల్లో పత్తిని తీసుకురావడం మానుకోవాలని సూచించారు. సి.సి.ఐ. కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి అమ్మకం జరిగితే రైతులకు పారదర్శకమైన ధర, నేరుగా బ్యాంక్ ఖాతాల్లో చెల్లింపులు జరగడం జరుగుతుందని తెలిపారు. రైతు సోదరులు మధ్యవర్తులు లేదా దళారులను ఆశ్రయించకుండా నేరుగా సి.సి.ఐ. కేంద్రాలకే పత్తిని విక్రయించాలని ఆయన కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పత్తి ఉత్పత్తిదారులకు సరైన ధర అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆదూరి విజయ్ కృష్ణ, సి.సి.ఐ. కమర్షియల్ ఆఫీసర్ శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ గోవిందు మరియు ఇతర సిబ్బంది ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలసి, ఆదోనిలో అక్టోబర్ 27వ తేదీ సోమవారం నుండి ప్రారంభమవుతున్న సి.సి.ఐ. కొనుగోలు కార్యక్రమానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన నున్నట్లు తెలిపారు. రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించాలంటూ ఎమ్మెల్యే మార్కెట్ యార్డ్ సిబ్బందికి సూచించారు.

## అదుపు తప్పి గుంతలో పడ్డ విద్యార్థి బస్సు

**- ఎద్దుల బండిని తప్పించబోయి**



**గోనెగండ్ల, అక్టోబరు 25, ప్రభాతవార్త :** గోనెగండ్ల మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామ శివార్లలో శనివారం సాయంత్రం విద్యార్థి బస్సు (ఆర్‌టీసీ బస్సు)ఆదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడబోయి ఒక సైడ్‌కు ఒరిగింది.దీంతో బస్సులో ఉన్న మహిళకు కాలు విరిగింది.మిగిలిన ఇద్దరి ప్రయాణికులకు స్వల్ప గాయాలయాయి. గ్రామస్థులు అందిన సమాచారం మేరకు వివరాలు గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులను ప్రతిరోజు ఉదయం గ్రామం నుంచి పాఠశాలకు చేర్చడం,సాయంత్రం పాఠశాల నుంచి గ్రామానికి చేర్చడం కోసం ఎమ్మిగనూరు కు చెందిన ఆర్‌టీసీ డిపో నుంచి ఏపీ 21జెడ్ 0445 అనే బస్సును ఆర్‌టీసీ అధికారులు ఏర్పాటు చేశారు.అయితే ప్రతి రోజు మాదిరే శనివారం కూడా సాయంత్రం మోడల్ స్కూల్ నుంచి హెచ్ కైరవాడి,పెద్దనేలటూరు విద్యార్థులను బస్సులో ఎక్కించుకొని గ్రామాలకు బయలుదేరింది. హెచ్ కైరవాడి విద్యార్థులకు గ్రామంలో దిప్పి అనంతరం పెద్దనూలటూరు బయలుదేరి అక్కడ విద్యార్థులకు దిప్పితిరుగు ప్రయాణం అయింది.అయితే ఆదే బస్సులో హెచ్ కైరవాడి,గోనెగండ్లకు వచ్చేందుకు ముగ్గురు ప్రయాణికులు ఎక్కారు.అందులో ఒకరు పెద్దనేలటూరు చెందిన బోయ లక్ష్మీదేవమ్మ,ఒక మహిళ కానిస్టేబుల్,కోడుమూరుకు చెందిన ఒక ఫోటో గ్రాఫర్‌తో కలిపి ముగ్గురు ఎక్కారు.గ్రామ శివార్ల దాటగానే బస్సుకు ఎదురుగా ఎద్దుల బండి వచ్చింది దాన్ని తప్పించేందుకు బస్సును డ్రైవర్ రాకేష్(కాంట్రాక్ట బేసిక్ డ్రైవర్) రోడ్డును దిగాడు అక్కడ వర్షం కారణంగా బురుద ఉడంటంతో బస్సు టైర్లు స్కిడ్ అయి అదుపుతప్పి గుంతలో పడబోయింది.అదృష్టవశాత్తు అక్కడ విద్యుత్ పోల్ ఉండటంతో బస్సు విద్యుత్ పోల్‌కు అనుకోనడంతో బస్సు బోల్తా పడకుండా ఒక సైడ్ ఒరిగింది. అయితే అదే సమయంలో బస్సులో ఉన్న బోయ లక్ష్మీదేవమ్మ కుడికాలు పై స్టేప్నీ టైర్ పడటంతో ఆమె కాలు విరిగింది.ఆమె కు కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలంను చేరుకొని విచారణ చేస్తున్నారు.

**-ఃవిచారణ చేస్తున్నాముః-మద్దిలేటినాయుడు,డీఎం,ఆర్‌టీసీ,ఎమ్మిగనూరు .**

ప్రమాదం జరిగిన విషయంపై వార్త వివరణ కోరగా ప్రమాదం జరిగిన విషయం తెలిసింది.విచారణ చేస్తున్నాము.పూర్తి వివరాలకు గ్యారేజ్ ఇన్‌చార్జి బాలాంజినేయులను సం ప్రదించమనడంతో బాలాంజినేయులను స ంప్రదించింది.విద్యార్థి బస్సు పెద్దనేలటూరు నుంచి తిరుగు ప్రయాణంలో గ్రామ శివార్లు దాటగానే బస్సుకు ఎదురుగా ఎద్దుల బండి రావడంతో బస్సు డ్రైవర్ రాకేష్ తప్పించబోయి గుంతలో పడబోయారు.విద్యుత్ స్థంభంను అనుకోవడంతో ప్రమాదం తప్పింది .గాయాలపడ్డవారి గురించి విషయం తెలియదాన్నారు.

## హంద్రీకి జీడీపీ నీటి విడుదలను పెంచిన అధికారులు



**గోనెగండ్ల, అక్టోబరు 25, ప్రభాతవార్త :** గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి శనివారం ఉదయం నుంచి జీడీపీ ఇరిగేషన్ అధికారులు హంద్రీనదికి జీడీపీ 4,5 గేట్లు ద్వార నీటి విడుదల చేశారు.ప్రాజెక్టు 4,5 గేట్లు ఎత్తి 3300క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు.గత రెండు రోజులుగా అడపదడప కురుస్తున్న వర్షాల కారణంగా జీడీపీ కి హంద్రీనది నుంచి 400 క్యూసెక్కుల నీరు చేరుతుంది.అలాగే శుక్రవారం సాయంత్రం నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలైన మద్దికెర, తుగ్గలి,పత్తికొండ,ఆస్పరి,దేవనకొండ తదితర ప్రాంతాలలో ఒక మోస్తారు వర్షం కురియడంతో శనివారం ఉదయంకు వరద నీరు వచ్చి చేరుతుంది.దీంతో ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి నీటి విడుదల చేశారు.అలాగే గోనెగండ్ల తుంగభ ద్ర దిగువ కాలువ ఎస్కేప్ చానల్ ద్వా ర గాజులదిన్నె ప్రాజెక్టు లోకి 190 క్యూసెక్కుల నీటిని ఎల్లెల్సీ ఇరిగేషన్ అధికారుల విడుదల చేస్తున్నారు.ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.మంగళవారం సాయంత్రకు నీటి మట్టం (4టీఎంసీ) 376.70 మీటర్లు ఉంది.దీంతో జీడీపీ నిండు కుండలా మారింది.జీడీపీ పూర్తిస్థాయి నీట మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.30 మీటర్లు మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు.ప్రాజెక్టులో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా పూర్తిగా ఉందని ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటి కప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.రబీ సీజన్‌లో జీడీపీ ఆయకట్టు రైతులకు నీటి ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ కార్మికుల బైకు ర్యాలీ..



**కర్నూలు, అక్టోబర్ 25, ప్రభాతవార్త ప్రతినిధి :** మునిసిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏ.ఐ.టి.యు.సి. అనుబంధ ఏ.పి. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కర్నూలు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులు ఏ.ఐ.టి.యు.సి. కార్మిక సంఘం ఆధ్వర్యంలో బైకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఏ. ఐ. టి.యు.సి. జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప ఏ.ఐ.టి.యు.సి. జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక ఏ.ఐ.టి.యు.సి. కార్యాలయం ధర్మపేట నుండి మొదలుకొని వై. యస్. రాజశేఖరరెడ్డి సర్కిల్, పాత కంట్రోల్ రూం, కొండారెడ్డి బురుజు, పెద్దపార్కు, రాజవిహార్ సెంటర్, మౌర్య హోటల్ మీదుగా ఏ.ఐ.టి.యు.సి.. జిల్లా కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా బైకు ర్యాలీని ఉద్దేశించి ఎస్.మునెప్ప మాట్లాడుతూ 2023సంవత్సరంలో సమ్మె సందర్భంగా మునిసిపల్ ఉద్యోగులు, కార్మికులకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మునిసిపల్ కార్మికులకు, ఇంజనీరింగ్ ఉద్యోగులకు కనీసవేతనం 26 వేల రూపాయలు చెల్లించాలన్నారు. 11.వ. పి. ఆర్. సి.బకాయిలను వెంటనే చెల్లించాలని, 12.వ. పి.ఆర్. ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మధ్యంతరభృతిని 30శాతం చెల్లించాలని కోరారు. కార్మికుల, ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలను అమలు చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం మున్సిపాలిటీల నందు పనులను ప్రైవేటుగా అప్పగించడాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏ.ఐ.టి.యు.సి. నగర ఉపప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, ఏ.పి. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, మునిసిపల్ నాయకులు యం. బాబులాల్, నాగేషులు, వి. స్వాములు, సాయి, కార్మికులు యన్.భాస్కర్, కె.చిన్ననాగేషులు, ఎస్.తిమ్మప్ప, ఏ.నాగన్న, శివయ్య, జయరామిరెడ్డి, యం.వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

## జ్యువలరీ షాపులో చోరీ...

**- కేసు నమోదు చేసిన పోలీసులు**




**మంత్రాలయం, అక్టోబరు25, ప్రభాతవార్త;** మంత్రాలయం మండలం మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుంగభద్ర గ్రామంలో ఉన్న జ్యువెలరీ షాపులో చోరీ జరిగినట్లు మాధవరం ఎస ఐ విజయ్‌కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. వివరాల మేరకు... టి.నారాయణపురం గ్రామానికి చెందిన కంసాలి రవికుమార్ అనే వ్యక్తి తుంగభద్ర గ్రామంలో జ్యువెలరీ షాపు నిర్వహిస్తున్నాడు. అయితే అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని దుండగులు షాపు షెట్టర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న నాలుగు కేజీల వెండి నగలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. క్లూస్ టీం సిబ్బంది, సీఐ రామాంజులు ఆధ్వర్యంలో చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలన చేశామన్నారు. షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## బయో మెట్రిక్ పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు ఆధార్ క్యాంపు

**పాములపాడు, అక్టోబరు 25, ప్రభాతవార్తః**

బయోమెట్రిక్ పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. పాములపాడు మండల కేంద్రంలో ఈనెల 27న సి వివేకానంద విద్యావిహార్ పాఠశాల నందు ఆధార్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. 28న జడ్పీహెచ్ హైస్కూల్ నందు, 29, 30 తేదిల్లో ఏపీ మోడల్ స్కూల్ నందు ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని బయోమెట్రిక్, అలాగే విద్యార్థుల పేర్లు సవరణ కూడ చేసుకోవచ్చని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు బంగారు పథకాలు సాధించిన



**ఎమ్మిగనూరు,అక్టోబర్ 25, ప్రభాతవార్త:** పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు అంటూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి బోయ నర్సింహులు ఇటీవల ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో 800, 1500, 4 400 రిలే పరుగు పందెంలలో మూడు బంగారు పతకాలను సాధించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక జూనియర్ కలశాలలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో హాలహర్వి గ్రామానికి చెందిన ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి బోయ నర్సింహులు ను ప్రిన్సిపాల్ ప్రసాద్ అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పరుగు పోటీలో మెరికల్లాంటి ప్రతిభను కనబరచి మూడు బంగారు పతకాలు సాధించడమే కాకుండా నవంబర్ నెలలో హర్యాన రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారుడు నర్సింహులు మాట్లాడుతూ. నాకు వెన్నంటి ప్రోత్సహిస్తున్న కోచ్ మల్లికార్జున కఠోర శ్రమ, ఆటలోని మెలుకువలను నేర్పించి నన్ను ఇంతవాణ్ణి చేశారన్నారు. ఉపాధ్యాయులు రుక్మాన్, రంగస్వామి,ఎల్లప్ప,రాజశేఖర్,లక్ష్మన్న,రంగనాయక్, తల్లిదండ్రులు రగయ్యా,జయమ్మలు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం ఏఐటీయూసీ



**కర్నూలు, అక్టోబర్ 25, ప్రభాతవార్త ప్రతినిధి :** గత కొంతకాలము నుంచి అనారోగ్యంతో బాధపడు తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కే.కృష్ణకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం నాడు 8వేల రూపాయలు ఆర్థిక సాయం చేసినట్లు ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకటేష్ చంద్రశేఖర్లు తెలిపారు. అనారోగ్యంతో పనులు చేయలేక ఇంటి వద్దనే ఉన్నటువంటి కృష్ణాను ఆదుకునేందుకు ఏఐటీయూసీ నాయకులు ముందుకు వచ్చారు ఇందులో భాగంగా నాయకుల నుంచి స్వీకరించిన డబ్బులు 8000 రూపాయలు కే.కృష్ణకు అందజేయడం జరిగినది. ఆటో వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఆర్ కృష్ణారెడ్డి హోటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజనే యులు భవననిర్మాణ సంఘం నాయకులు నల్లాన్న ఈశ్వర్ రెడ్డి,కృష్ణారెడ్డి కలిసి అందజేయడం జరిగినది.

## తడకనపల్లి గ్రామంలో పీఎంఏవైజీ 2.0 పథకం కింద 97 ఇల్లు మంజూరు

**కర్నూలు అర్బన్, అక్టోబర్ 25, ప్రభాతవార్త :**



కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని తడకన పల్లి గ్రామంలో పీఎంఏవైజీ (ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ) 2.0 పథకం క్రింద మొత్తం 97 ఇళ్లు మంజూరు అయ్యాయని హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి తెలిపారు. ఆయన గ్రామాన్ని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి ఇంటికి రూ. 1,59,000/ చొప్పున మంజూరు చేయబడిందని, ఆ ఇళ్ల వివరాలను ఈఏ లు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన సూచించారు. అలాగే, వెరిఫికేషన్ ప్రక్రియను ఎలా చేస్తున్నారని పరిశీలించారు. ఈ ప్రక్రియను నవంబర్ 5వ తేదీ లోపు పూర్తి చేయాలని, పై అధికారుల నుండి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు.అదేవిధంగా లబ్ధిదారులు ఆన్‌లైన్ ఎంట్రీ కోసం అవసరమైన పత్రాలు రేషన్ కార్డు, భార్య/భర్తల ఆధార్ కార్డులు, జాబ్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పొజిషన్ సర్టిఫికెట్ మొదలైనవి సర్టిఫికెట్లు ఉండాలని తెలిపారు. గ్రామ సర్పంచ్, హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు (ఈఏ లు) మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి ఉలిందకొండ గ్రామాన్ని సందర్శించారు. .

## 29న కుంకనూరు పంచాయతీ దినసరి కూరగాయల మార్కెట్ వేలం

**దేవనకొండ, అక్టోబరు25, ప్రభాతవార్త;**

ఈనెల 29వ తేదీన మండల పరిధిలోని కుంకనూరు గ్రామ పంచాయతీ దినసరి కూరగాయల మార్కెట్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ గోపాల్, గ్రామ సర్పంచ్ వీరమ్మ, పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌సింగ్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి దగ్గర 2025-2026 సంవత్సరానికి సంబంధించి వేలం పాట చేపడుతున్నట్లు తెలియజేశారు. వేలంపాటలో పాల్గొనే వారు దారావత్తు రూ.50 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలం గెలుచుకున్న వారు వేలం పాట ముగిసిన వెంటనే వేలంపాట మొత్తం ఒకేసారి చెల్లించాలన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు మద్యం సేవించరాదని, గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండకూడదన్నారు. హెచ్చు పాటలో నిలిచి మార్కెట్ వేలం హక్కును పొందిన పాటదారుడిపై నిబంధనలకు కట్టుబడి ఉంటానని, రూ.100 స్టాంపు కాగితంపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి అగ్రిమెంట్ చేసి ఇవ్వాలన్నారు. ఈ వేలం గ్రామ పంచాయతీకి లోబడే ఉంటుందన్నారు.

## బనగానపల్లెలో ప్రైవేటీకరణపై ప్రజా వ్యతిరేకత సంతకాలు పూర్తిచేయండి..

**- బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**



**బనగానపల్లె, అక్టోబరు 25, ప్రభాతవార్తః** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటీ సంతకాల కార్యక్రమాన్ని బనగాన పల్లె పట్టణంలో బూత్ కమిటీ కన్వీనర్లు పూర్తిచేయాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డిలు బూత్ కమిటీ కన్వీనర్లకు సూచించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం మండల బూత్ కమిటీ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పెద్ద ఎత్తున కోటీ సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేట్‌పరం అయితే ఎలాంటి నష్టం వాటిల్లుతుందో ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 28న నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా ప్రజా ఉద్యమర్యాలీలో పాల్గొనేలా ప్రజలను చైతన్యం చేయాలని బూత్ కమిటీ కన్వీనర్లకు ఆయన సూచించారు. బనగానపల్లె మండల వైసీపీ కన్వీనర్ సన్నల జనార్థన్‌రెడ్డి, వైసీపీ పట్టణ కన్వీనర్ అబ్దుల్ ఫైజ్, లీగల్‌సెల్ కన్వీనర్ అబ్దుల్ ఖైర్, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, నియోజకవర్గ వైనార్టీ అధ్యక్షుడు అనిల్, వైసీపీ బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు హాజరయ్యారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం

**ఆత్మకూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:**



అంతర్జాతీయ బాలికల దినోత్సవం వేడుకల సందర్భంగా శనివారం మండల పరిధిలోని కరివేన జిల్లా పరిషత్ హైస్కూలులో బాలికల దినోత్సవ వేడుకలను ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి కోటేశ్వరి ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా డిసిపిఒ స్వప్న ప్రియదర్శిని హాజరైయ్యారు. ముందుగా బాలికల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసిడిఎస్ అధికారిణులు మాట్లాడుతూ బాలికలు పట్టుదలతో ఉన్నత చదువులు చదివితే రాబోయో బావితారలలో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసేవారు అవుతారని చదువును వదిలి పెడితే జీవితం ఏమవుతుందో అర్థంకానీ పరిస్థితి అని అన్నారు. చదువుతోనే ఎన్నో జీవితాలు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని వివరించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థినీయులకు పలు పాఠ్యపుస్తకాలు బహుమతులు పంపిణి చేశారు. ప్రతి సంవత్సరం బాలికల దినత్సవ వేడుకలను ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో జరగడం హర్షించదగ విషయమని నంద్యాల జిల్లా డిసిపిఒ స్వప్న ప్రీయదర్శిని హర్షం వ్యక్తం చేశారు. చెరకకాలనీ అంగన్‌వాడి కార్యకర్త షరిఫా సేవలు ఎంతో అభినందనీయమని కొనియడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సయ్యద్ సనావుల్లా, జిఎంఎస్‌కే నాగలక్ష్మి, ఉపాధ్యాయులు వసుంధర, కృష్ణవేణి, గ్లోరిదమాయని, అంగన్‌వాడి కార్యకర్తలు రవణమ్మ, శ్యామలమ్మ, మహేశ్వరి, నాగమ్మ, అదిలాష, బాలికలు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## టెట్ పాసైతేనే.. టీచరు కొలువు..!

**(మొదటి పేజీ తరువాయి ) : సర్వీసు నిబంధనలకు విరుద్ధం:**

టెట్ అర్హత తప్పని సరి చేయడం సరికాదని రిటైర్డ్ టీచర్లు, సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు..టెట్ నిబంధనపైప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు..2010 ఆగస్టు తరువాత జరిగిన నియామకాలన్నీ టెట్ నిబంధనలకు లోబడే జరిగాయి.. కానీఅప్పటికే సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ తప్పనిసరి అంటూ నేషనల్ కౌన్సిల్ ఫషర్ టీచర్స్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) నిబంధనల్లోఎక్కడా లేదని వారు పేర్కొంటున్నారు.. పైగా రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల్లో కూడా ఇప్పటికే వృత్తిలో ఉన్న ప్రభఉత్వ టీచర్లు టెట్అర్హతను సాధించాలన్న నిబంధన లేదని చెబుతున్నారు..

**పునఃసమీక్షించేందుకు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంది:**

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ నిబంధనను పున: సమీక్షించాలంటూ రివ్యూ పిటీషన్‌ను ప్రభుత్వం దాకాలు చేయాలని పలువురుసీనియర్ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇప్పటికీ ఈ అంశానికి సంబందించి కూటమిప్రతినిధులను కలసి వినతి పత్రాలను ఇచ్చినట్లు సమాచారం.. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది..కాగా 50 సంవత్సరాలు పైబడిన టీచర్లు పదోన్నతి పొందేందుకు ఈ టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ కొన్ని ఉపాధ్యాయసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.. అలాగే ఉద్యోగన్నతి తరువాత టెట్ అర్హత సాధనకు కనీసం నాలుగు ఏళ్ల గడువు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు..

**కొసమెరుపు:** కొసమెరుపు ఏమిటంటే దీర్ఘకాలంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న టీచర్లపై ఇది భారమే..ఇప్పటికే పనుల భారంతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు ఇది బెట్టులాంటిది..

## ప్రమాదానికి.. అసలు కారణం..?

**(మొదటి పేజీ తరువాయి ) :** బైక్‌పై మనిషి ఉన్నాడా.. అనే విషయంపై స్పష్టత లేని డ్రైవర్ యాక్సిడెంట్ జరిగిందని భయపడ్డాడు. తప్పించుకునేందుకు బస్సు వేగం మరింత పెంచాడనే చర్చ జరుగుతోంది. బస్సు కింద ఉన్న బైక్ రోడ్డుకు రాసుకొని మంటలు వ్యాపించే వరకు బస్సును ఆపకపోవడం డ్రైవర్ దుర్మార్గమని స్థానికులు అంటున్నారు. బైక్ పై బస్సు ఎక్కిన వెంటనే 100 మీటర్ల లోపు బస్సును ఆపి ఉంటే.. మంటలు చెలరేగేవి కాదని, 19 మంది ప్రాణాలు నిలబడేవని అంటున్నారు. ఇక్కడ రోడ్డుపై బైక్ ఉన్నప్పటికీ బైక్ విషయంలో బస్సు డ్రైవర్ శ్రద్ధ తీసుకోకపోవడం ప్రమాదానికి అసలు కారణంగా పేర్కొంటున్నారు. అంతేగాక అతివేగం కారణంగా బస్సు కూడా కంట్రోల్ కాలేదని తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా బైక్ నడిపిన శివశంకర్ మద్యం తాగాడని చర్చ జరుగుతుంది. ఇక్కడే స్థానికుల నుంచి మరో ప్రశ్న వినిపిస్తోంది. ప్రమాదం జరిగిన రెండు, మూడు గంటలలోపే డ్రైవర్లు పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారని తెలుస్తోంది. డ్రైవర్లకు డ్రంకన్ టెస్టులు చేయించారా అని ప్రశ్నిస్తున్నారు. ఆ విషయంపై ఎలాంటి వివరాలు ఇప్పటి వరకు బయటకు రాలేదు. మొదట ఒక డ్రైవర్ మాత్రమే పోలీసులు అదుపులో ఉన్నారన్నారు. తర్వాత ఇద్దరు డ్రైవర్లు పోలీసులు అదుపులో ఉన్నారని ప్రకటించారు. కాగా ఇద్దరు డ్రైవర్లు ఆక్సిడెంట్ జరిగిన రెండు మూడు గంటల లోపే పోలీస్ స్టేషన్లో లొంగిపోయారని తెలుస్తోంది. వారికి డ్రంకన్ టెస్టులు చేయించి ఉంటే.. అసలు విషయాలు బయటకు వచ్చేవంటున్నారు. ఏది ఏమైనా ప్రమాదం జరిగిన మొదటి రోజు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ది పూర్తి తప్పిదమని.. రెండవ రోజు బైకర్ శివశంకర్ ది పూర్తి తప్పని చర్చ జరిగింది. అయితే నిపుణులు మాత్రం ప్రమాదానికి డ్రైవర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

## నవంబర్ నెలలో రైతులకు కొత్త రుణాలు అందిస్తాం

**- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుగుణాకర్**



**దేవనకొండ, అక్టోబరు 25, ప్రభాతవార్త;** నవంబర్ నెలలో రైతులకు కొత్త రుణాలు ఇస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుగుణాకర్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.45 వేల దాకా ఇస్తామన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుకు సంబంధించి ఖాతాదారులు ఖాతా మార్పునకు డిసెంబర్ దాకా సమయం ఉందని, ఖాతాదారులు తొందరపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరు కూడా ఇబ్బంది పడకుండా పాత అకౌంట్ ద్వారానే లావాదేవీలు జరుపుకోవచ్చని తెలియజేశారు. కావునా మండలంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు ఖాతా మార్పు కోసం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## కల్వర్టుపైకి దూసుకెళ్లిన లారీ..

**- తపి ్పన పెను ప్రమాదం - లారీ డ్రైవర్ సురక్షితం**



**గడివేముల, అక్టోబర 25, ప్రభాతవార్త;** మండలంలోని గ్రంధివేముల సమీపంలో చిందుకూరు మధ్యలో ఉన్న కల్వర్టుపైకి నంద్యాల వైపు నుంచి గడివేముల వైపు లోడుతో వస్తున్న లారీ కల్వర్టుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. తృటిలో ప్రమాదం తప్పడంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు.ఈ సమయంలో ఎలాంటి వాహనాలకు ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీ ముందు భాగం కింద పూర్తిగా దెబ్బతింది. రెండు టైర్లు ఊడిపోయాయి. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం..

**మంత్రాలయం, అక్టోబరు25, ప్రభాతవార్త;**

మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో ఓ నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నం చేశాడు. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ అధికారులు స్థలం కబ్జా ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. సదరు నాయకుడిపై మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా ఉన్న జెట్టి పద్మనాభం అనే నాయకుడు గ్రామంలో ఉన్న స.నం.159 గ్రామకంఠం స్థలాన్ని కబ్జా చేసి అందులో ఓ దుకాణం ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశాడు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, గ్రామ సర్వేయర్ ఉదయ్‌లు స్థలాన్ని సర్వే చేసి గ్రామకంఠం స్థలంగా గుర్తించారు. ఈ విషయంపై అధికారులు మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ప్రభుత్వ స్థలంపై విచారణ చేస్తున్నట్లు మాధవరం పోలీసులు తెలిపారు.

## చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదం బాధాకరం

**- మృతుల కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలి..**



**హొళగుంద, అక్టోబరు25, ప్రభాతవార్త;** కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదం బాధాకరమని, మృతుల కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కర్నూలు జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ బెస్త గోవిందరాజులు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్లీపర్ బస్సులో అగ్ని ప్రమాదం జరిగి పదుల సంఖ్యలో ప్రజలు సజీవ దహనమయ్యారన్నారు. ప్రైవేట్ స్లీపర్‌బస్సుల్లో లగేజీలకు ఆశపడి బస్సులలో నాణ్యత నిర్మాణం లేకుండా ప్రజల ప్రాణాలు తీయడానికి రోడ్డు మీదకు వస్తున్నాయన్నారు. ఈ బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సబ్ ట్రెజరీ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



**పత్తికొండ,అక్టోబరు 25,ప్రభాతవార్త:** పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేసి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఏఐటియుసితాలుకా కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయప మాట్లాడుతు వివిధ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులను ట్రెజరీ కార్యాలయంలో బిల్లులు చేయకుండా వేధిస్తూ చేతులు తడిపిన వారికి మాత్రమే బిల్లులు మంజూరు చేస్తు ముడుపులు దండుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ట్రెజరీలో జరుగుతున్న అక్రమాలపై తీవ్రమైన ఆరోపణలు వస్తున్న జిల్లా అధికారులు పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకొని ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను పరిష్కారించాలని లేని పక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయ. కార్మిక సంఘాలతో కలిసి ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

## సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**మంత్రాలయం, అక్టోబరు25, ప్రభాతవార్త;**



పెద్దకడబూరులో ఈనెల 27వ తేదీన సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగే సదస్సును ప్రతిఒక్కరూ జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు తిక్కన్న, హెచ్.జయరాజులు కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పెద్దకడబూరు, మంత్రాలయం మండలంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని వారు మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కోరారు. ఈ మండలాలకు సాగునీరు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వైద్యం మౌలిక సదుపాయాలు కల్పించి తక్షణమే ప్రజలను ఆదుకోవాలని కోరారు. అలాగే ఆర్‌డీఎస్ కుడి కాలువ పనులను వెంటనే చేపట్టాలని, పులి కనుమ ప్రాజెక్టు ద్వారా పెద్దకడబూరు మండలానికి సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. గురు రాఘవేంద్ర లిఫ్ట్ ద్వారా మాధవరం లిఫ్ట్‌కు నూగూరు లిఫ్ట్‌కు బసలదొడ్డి లిఫ్ట్ ద్వారా సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. మండలంలోని చిలకలడోన, కల్లుదేవకుంట గ్రామానికి పాత పైపులైన్లు తొలగించి కొత్త పైపులైన్లు వేసి తాగునీరు అందించాలన్నారు. అలాగే మంత్రాలయం మండలకేంద్రంలో ఎస్ఎస్ ట్యాంకును ఏర్పాటు చేసి, మంల ప్రజలకు తాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. కేవీపీఎస్ నాయులు అంజి, పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజ్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా.. కోటి సంతకాల సేకరణ..!

**: 28న నియోజకవర్గకేంద్రంలో చేపట్టే కార్యక్రమం జయప్రదం చేయాలి**
**: పగిడ్యాల వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి పిలుపు**



**పగిడ్యాల, అక్టోబరు 25, ప్రభాతవార్త :** రాష్ట్ర వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం సమన్వయ కర్త డాక్టర్ ధారా సుధీర్, వైఎస్ఆర్‌సిపి యువజన విభాగము వర్కింగ్ ప్రసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాలమేరకు పగిడ్యాల, ముచ్చుమర్రి, నెహ్రూనగర్ గ్రామాలలో శనివారం కోటి సంతకాల సేకరణలో బాగంగా గోడప్రతులను వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజ్‌లను ప్రైవేటికరణ చేస్తే పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులకు వైద్యవిద్యఅందని ద్రాక్షగా మారుతుందన్నారు. అందరికీ వైద్యవిద్య అందించవలసిన ప్రభుత్వం బాధ్యతను విస్మరించినందునకు నిరసనగా కోటి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఈ నెల 28వతేదీన నందికొట్కూరు నియోజకవర్గ కేంద్రంలోపెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నామనీ కావున. అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ మండల కన్వీనర్ పుల్యాల నాగిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, పాత ముచ్చుమర్రి సర్పంచ్ ఆంజనేయులు, పగిడ్యాల మాజీ సింగిల్ విండొ అధ్యక్షుడు సిరిగిరి రామచంద్రారెడ్డి, కొత్త ముచ్చుమర్రి మాజీ సర్పంచ్ మద్దిలేటి నాయుడు, వైఎస్ఆర్‌సిపి నాయకులు నాగసేనారెడ్డి, పులేంద్ర నాయుడు, మదుగాని శేషన్న, మహేష్ నాయుడు, సింగోటం, వైఎస్ఆర్‌సిపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిశోధన సామర్థ్యాలను పెంపొందించడానికి మల్టీడిస్ప్లినరీ విధానాన్ని అవలంబించాలి



**కర్నూలు విద్య, అక్టోబరు 25, ప్రభాతవార్తః** జ్ఞానం, పరిశోధన సామర్థ్యాలను పెంపొందించడానికి మల్టీడిస్ప్లినరీ విధానాన్ని అవలంబించాలని ప్రొఫెసర్ రావు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం క్లస్టర్ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ డా.జి శ్రీనివాస్ అధ్యక్షతన క్లస్టర్ యూనివర్శిటిలోని మూడు కళాశాలల ప్రిన్సిపాల్స్ మరియు అధ్యాపకులతో బోధన, పరిశోధనలపై ఇంట్రాక్షన్ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా వేత్తలు, నిర్వాహకులు అధ్యాపకులు కలిసి సంస్థాగత అభివృద్ధి విద్యా నైపుణ్యం మరియు విద్యార్థి కేంద్రీకృత సంస్కరణలను చర్చించారు. క్లస్టర్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు, ఏపీఎస్‌సిహెచ్ఈ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కర్‌రావులు ముఖ్య అతి ధులుగా హాజరయ్యారు. జిడిసి మెన్ ప్రిన్సిపాల్ డా.ఎం ఇందిరాశాంతి, కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.వెంకటరెడ్డి, డీన్‌లు, విభాగాధిపతులు, మూడు కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు. రిజిస్ట్రార్ డా.జి శ్రీనివాస్ మాట్లాడుతూ క్లస్టర్ విశ్వవిద్యాలయం యొక్క విద్యా, పరిపాలన విభాగాలు వైస్ ఛాన్సలర్ యొక్క చురుకైన నాయకత్వంలో అభివృద్ధి చెందుతున్నా యన్నారు. ముఖ్యఅతిథి ఏపీఎస్‌సిహెచ్ఈ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు ప్రసంగిస్తు మూడు కళాశాలల అధ్యాపకులతో వివిధ బోధన మరియు పరిశోధనకు సంబంధించిన అంశాల గురించి చర్చించారు. సమిష్టికృషి, సరైన దోరణి మరియు విలువ ఆధారిత విద్య యొక్క ప్రాముఖ్య తను ఆయన నొక్కిచెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ విశ్వవిద్యాలయం యొక్క విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరు కృషిచేయాలని సూచించారు. పిఎం యువ మెంటార్ షిప్ స్కీమ్ 3.0 అల్ ఇండియా యంగ్ రైటర్స్ కాంపిటీషన్లో ప్రతిభ కనబరిచిన సిల్వర్ జూబ్లీ కళాశాల బీకాం ఫైనల్ విద్యార్థి నిఖీల్ రచించిన మెకర్స్ అఫ్ మోడరన్ ఇండియా బుక్ ప్రపోజల్‌ను అభినందించారు.

## ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**కొత్తపల్లె, అక్టోబరు 25, ప్రభాతవార్తః** ఈనెల 28న నందికోట్కూరులో జరిగే వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీటిసి సోమల సుధాకర్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కె సుధాకర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం మండల కే ంద్రంలోని వైసీపీ శ్రేణులతో కలిసి వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర ్బంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్యకళాశాలలను ప్రైవేటీకరణకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కళాశాలలను ప్రైవేటీకరణతో పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తు ఈనెల 28న నందికొట్కూరులో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అదేశాల మేరకు వైస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త దారా సుధీర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.సర్పంచ్‌లు మారెన్న, బాల యల్లయ్య, ఎంపిటిసి బాలరాజు, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, నియోజకవర్గ వైసీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు రహింతుల్లా, క్రిస్టియన్ మైనార్టీ మండల అధ్యక్షుడు పరశురాముడు, మాజీ ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, ఉస్మాన్‌బాష, రవీంద్రారెడ్డి, సి శ్రీనివాసులు యాదవ్, రామలింగారెడ్డి, నాగార్జునరెడ్డి, సోమల రవీంద్రారెడ్డి పాల్గొన్నా న్నరు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన గూడూరు విద్యార్థిని



**గూడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** రాష్ట్ర స్థాయి బాలికల విభాగంలో జరిగే రా ష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ముబీనా ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 23 వతేదిన కర్నూలులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న ముబీనా ఆటల్లో అత్యంతా ప్రతిభా పాటవాలను ప్రదర్శించి టీమ్ గెలుపుకు కృషి చేసిన ముబీనా గెలుపుపై పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు. ఇదే ఆటను రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించి కర్నూలు జట్టు గెలుపును సాధించాలని విద్యార్థిని తండ్రీ గూడూరు టీడీపీ మైనార్టీ అధ్యక్షులు సులేమాన్,స్థానిక ప్రజాప్రతినిధులు మైనార్టీ సోదరులు ఆశాబావం వ్యక్తం చేశారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజలతో కలిసి ఉద్యమిస్తాం



**పాములపాడు, అక్టోబరు 25, ప్రభాతవార్తః** రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని వైఎస్సార్‌సీపీ మండల అధ్య క్షుడు టి నాగరాజు అన్నారు. పాములపాడు మండల కేంద్రంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. నాగరాజు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా దూరమవుతుందని అంతేకాక పేదలు డాక్టర్ కోర్సులకు దూరమవుతారన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కుతీసుకొని ప్రభుత్వమే మెడికల్ కళాశాలల నడపాలని లేనిపక్షంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలిపారు. వైసీపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, శెట్టి శివలింగం, బత్తిని చరణ్‌కుమార్, బాలు నాయక్, వుశేన్, జిలాని బాషా, మున్నా, దర్గయ్య, ముర్తుజా వలిలు పాల్గొనా న్నరు.

## వైద్యశాలల ప్రైవేట్ కరణను అడ్డుకుందాం.. కదిలిరండి..!

**కోడుమూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** విద్యార్థుల సంక్షేమం కోసం గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలను నేటి కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేక ప్రైవేట్ పరం చేసే ఆలోచనను అడ్డుకుందాం .. కదిలిరండని ... కోడుమూరు వైసీపీ నేత యాపదిన్నే మద్దిలేటి పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28వ తేదిన అన్ని నియోజకవర్గ కేంద్రాలల్లో తలపెట్టిన ఈ ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు వైసీపీ దండు భారీ ఎత్తున కదిలిరావాలన్నారు. గత 16 నెలల కూటమి పాలన గాడితప్పిందని,ఆ పాలనపై ప్రజలు పెదవిరుస్తున్నారన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం భారత దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రరాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను మంజూరు చేసిందన్న విషయాన్ని గుర్తు చేశారు. నేటి కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేక వాటిని ప్రైవేట్ పరం చేసి వైద్య చదువులను వ్యాపారం చేసేందుకు సిద్ధమైందని ఆరోపించారు. ఇలాంటి కుట్రలపై వైసీపీ పోరుబాట పట్టిందని, వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులకు వైద్య విద్యకు దూరం చేసే కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టుతామని, ఇలాంటి వాటిపై వైసీపీ పార్టీ చేట్టిన ఆందోళన బాటకు ప్రజలంతా ఊరురూ కదిలి రావాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక అయిన హొత్తిబెళగల్ విద్యార్థులు



**ఆలూరు, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు మండల పరిధిలోని హొత్తిబెళగల్ విద్యార్థులు ఎంపిక అయినట్లు ఫిజికల్ డైరెక్టరు చిన్నబాబు తెలిపారు. ఈ నెల 12న కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ సెపక్‌తక్రా ఎంపిక పోటీలో అండర్-14 విభాగంలో బాలుర విభాగంలో ఎస్ సమీర్‌బాష, పి.సమీర్‌బాష 9వ తరగతి, బాలికల విభాగంలో కె. అకాంక్ష 7వ తరగతి, అండర్-17 విభాగంలో కె.రియాజ్ లు అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి ఎంపిక అయ్యారని ప్రధానోపాధ్యాయుదు రామసుబ్బయ్య తెలిపారు. విద్యార్థులను క్రీడాకార్డులుగా తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టరు ను వ్యాయామోపాధ్యాయుదు రవీంద్రను అధ్యాపకులు ఖాసింవలి, నరహరి అభినంధించారు.

## గూళ్యం పంచాయతీ కార్యదర్శికి పదోన్నతి



**హాలహర్వి, అక్టోబరు25, ప్రభాతవార్త;** మండలంలోని గూళ్యం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రామాంజనేయులకు ఈఓపీఆర్‌డీగా పదోన్నతి వచ్చింది. రామాంజనేయులకు పదోన్నతి రావడంతో మండలంలోని తోటి పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులకు పదోన్నతి రావడం హర్షించదగ్గ విషయమని ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. రామాంజనేయులు విధుల పట్ల అంకితభావం, నిజాయతీతో పని చేసేవాడన్నారు. రామాంజనేయులు పదోన్నతిపై మంత్రాలయంకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రామాంజనేయులను కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలు వేసి సన్మానించారు. ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, ఓంప్రకాష్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదు -ఈవో



**మహానంది, అక్టోబరు 25, ప్రభాతవార్తః** దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదని కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరెడ్డి శనివారం పరిశీలించారు. కార్తీకమాసం సందర ్బంగా మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ఏర్పాటు చేస్తున ్న వివిధ ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరుగుదొడ్లను పరిశీలించి భక్తుల నుండి డబ్బులు వసూలుచేస్తే చర్యలు తప్పవన్నారు. మరుగుదొడ్లను ఉచితంగా వాడుకోవచ్చని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సూచికబోర్డులను పరిశీలించి లేనిచోట ఏర్పాటు చేయాలని అదేశించారు. వాహనాలు నిలుపుదల ప్రాంతాల్లో నీరు నిలిచివుండడంతో ఆ ప్రాంతంలో మట్టివేయాలని తెలిపారు. ఆయన వెంట ఇంచార్జీ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత తోనే ప్రశాంతత



**నందికొట్కూరు,అక్టోబరు 25,ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక చింతన ప్రతి మానవుడికి అవసరమని ఆద్యాతిక చింతనతోనే ప్రతి మానవుడికి శాంతి సుస్థిరతలు చేకూరుతాయని, సమాజం శాంతి సౌభాగ్యాలతో విరజిల్లుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్.మల్లు వేంకటరెడ్డి అన్నారు. తితిదే ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీ నుండి నవంబరు 5వ తేదీ వరకు నందికొట్కూరు పట్టణంలోని కోటవీధిలోని శ్రీవీరభద్ర భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం నందు ధార్మిక సప్తహానికి సంభంధించిన కరపత్రాలను వారు స్థానిక ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతు ఇటువంటి కార్యక్రమాలను సమాజం ఎంత ఉపసయోగించుకుంటే అంత ప్రయోజనకరమన్నారు. ధార్మిక సప్తాహంలో భాగంగా 30వ తేదీ నుండి డి.జగదీష్ ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తి రాజదాస్,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు గ్రహీత డాక్టర్.తొగట సురేష్‌బాబు,విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు జి.వేంకట రమణయ్య, తదితరులు కార్తీక మాస విశిష్టతపై ధార్మిక ప్రవచనాలు, ప్రతి రోజు శివస్తో త్ర నామ పారాయణం, 2వ తేదీ ఆదివారం సాయంత్రం జ్వాలాతోరణం,5వ తేదీ సాయంత్రం సహస్ర కార్తీక దీపోత్సవం ఏర్పాటు చేసినట్లు తితిదే జిల్లా శాఖ నిర్వాహకులు మల్లు వేంకటరెడ్డి తెలిపారు.

## రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

**- మార్కెట్‌యార్డు కమిటీ మాజీ చైర్మన్ గంధం వీర రాఘవరెడ్డి**



**రుద్రవరం, అక్టోబరు 25, ప్రభాతవార్తః** ఈసంవత్సరం భారీ వర్షాలతో మొక్కజొన్న, వరి పంటలు సాగుచేసిన నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు కమిటీ మాజీ చైర్మన్ గంధం వీర రాఘవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రం రుద్రవరం సమీపంలో రైతులు రోడ్లపై అరబెట్టిన మొక ్కజొన్న ధాన్యాని ్న పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కురుస్తున్న భారీవర్షాలకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక భారీగా నష్టపోతున్నారన్నారు. రైతులు ఎకరాకు రూ.25 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేశారన్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీవర్షాల కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మొక్కజొన ్న ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారస్తులు క్వింటా రూ.1600లకు అడుగుతున్నారని దీంతో పెట్టిన పెట్టుబడులు రాక రైతులు నష్టపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామి ప్రకారం మొక్క జొన్న ధాన్యానికి రూ.2400 మద్దతు ధర ప్రకటించారని ఇచ్చిన హామి ప్రకారం మద్దతు ధరతో ఇంతవరకు మొక్కజొన్న ధాన్యాన్ని ఏ ఒక్కరు కొనుగోలు చేయలేదన్నారు. ప్రభుత్వం స ్పందించి వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధరతో మొక్కజొన్న ధానా ్యన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే ప్రస్తుతం ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు కోత దశలో ఉన్న వరి పంట నేలకొరిగి నీటిలో మునిగిందన్నారు. వరి పంటను కూడ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు భరోసా సిబ్బంది ఉన్నారు.

## కలెక్టర్ గారు మొక్కజొన్న రైతులను ఆదుకోండి



**జూపాడుబంగ్లా,అక్టోబరు 25,ప్రభాతవార్త:** నియోజకవర్గంలో దాదాపు 80 శాతం మంది రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారని ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెడితే పంట చేతికి వచ్చిందని వాటిని అమ్ముకునేందుకు దళారీల చేతిలో మోస పోకుండా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తంగడంచ, జూపాడుబంగ్లా గ్రామాలలో రైతులు ఆరబెట్టిన తడిసిన మొక్కజొన్న పంటను రైతు సంఘం నాయకులు రాజు, గోవర్ధన్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధర లేక పోవడంతో దళారీలకు రూ.2500 నుండి 1500లకు భారీ వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని అమ్ముకోవలసి వస్తున్నదని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని కావున జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే రూ.3 వేలు మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు., సిపిఐ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించక పోతే రైతులతో కలిసి అమరణ నిరాహార దీక్షను చేపడుతామని ఆయన తెలిపారు. సిపిఐ సహాయ కార్యదర్శి మగ్బుల్‌బాష, నాగన్న, రైతులు పాల్గొన్నారు.

## గుండం ఆంజనేయస్వామిలో ప్రత్యేక పూజలు



**కొలిమిగుండ్ల, అక్టోబరు 25, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల పరిధిలోని కోర్నపల్లి గ్రామ సమీపంలో ఉన్న గుండం అభయాంజనేయస్వామి సన్నిధిలో కార్తీక శనివారం సందర్బంగా ఉమ్మాయిపల్లి గ్రామస్తులు పూజలు మరియు అన ్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తుల సందడి నెలకొంది. కట్టెల కోలన్న కార్యక్రమం భక్తులను అకట్టుకుంది. కట్టెల కోలన్న కళాకారులను ఇటిక్యాల బాలిరెడ్డి అభినందిచారు. ఈకార్యక్రమంలో ఉమ్మాయిపల్లి గ్రామ ప్రజలు, ఉమ్మాయిపల్లి సర్పంచ్ అదినారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, గ్రామపెద్దలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన బస్సు ప్రమాదం..

**- డ్రైవర్ సురక్షితం**



**ఆదోనిలీగల్, అక్టోబరు25, ప్రభాతవార్త;** ఆదోని డిపోకు చెందిన ఏపీ 21జెడ్ 0629 నంబర్ గల విద్యార్థి బస్సు సర్వీసు శనివారం ఉదయం 6 గంటలకు డిపో నుంచి మాధవరం వరకు (రచ్చుమర్రి) బయలుదేరింది. బస్సు బయలు దేరుతూ ఆదోని శివారులోని ఇస్వీ రైలే ్వ ఓవర్ బ్రిడ్జి దగ్గర అదుపు తప్పి డొనల్‌లో బ్రిడ్జి సైడ్‌కు తిరిగిందని, ఇరువైపులా ఉన్న పొలాల రైతులు పేర్కొన్నారు. కానీ దేవుడి దయ వల్ల ఆ బస్సులో ప్రయాణికులు లేరు. ఒక్క డ్రైవర్ తప్పా. ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి డ్రైవర్ బస్సును సైడ్‌కు తిప్పారని వార్తలు వచ్చాయి. డ్రైవర్ అతి వేగమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంఘటన స్థలానికి ఆర్టీసీ డీఎంతో పాటు ఎన్ఎంయూ నాయకులు వెళ్లి పరిశీలించారు. జేసీబీతో బస్సును పక్కకు తీశారు.

## నల్లమలలో వాహనాలకు అంతరాయం



**మహానంది, అక్టోబర్ 25, ప్రభాతవార్తః** నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారిపై వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం ఉదయం నంద్యాల నుండి మొక్కజొన్న లోడుతో రాజ మండ్రికి వెళ్తున్న వాహనం ప్రమాదవశాత్తు నల్లమల అడవి ప్రాంతంలోని దిగువమెట్ట వద్ద ఉన్న పాత రైల్వేబ్రిడ్జిని ఢీకొనింది.ఈప్రమాదంలో డ్రైవర్ బాలవుశేని అక్కడికక్కడే మరణించగా క్లీనర్ చిన్నయ్యకు స్వల్పగాయాలయ్యాయి. లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచి పోవడంతో ఇరువైపుల నుండి రాకపోకలు నిలిచిపోయాయి.దాదాపు రెండుకిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోవడంతో సమాచారం అందుకున్న మహానంది ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి అదేశాల మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండాచేశారు. అడవి ప్రాంతంలో రెండు గంటలు పైనే వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

## నీట మునిగిన వరి పంటను పరిశీలించిన ఏవో..



**సాతనూరు/తుమ్మిగనూరు/కోసిగి, అక్టోబరు 25, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేలకొరిగిన వరి పంటలను మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ తన సిబ్బందితో కలసి పరిశీలించడం జరిగింది.. మండల పరిధిలోని సాతనూరు, తుమ్మిగనూరు గ్రామాల్లో 90 ఎకరాల్లో వేసిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వరప్రసాద్ రైతులతో మాట్లాడారు.. వరిమళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువల ద్వారా నీరు బయటికి వెళ్లే మార్గం చేసుకోవాలని సూచించారు.. వరిపైరు కింత పడే అవకాశం ఉన్నచోట పనలుగా కట్టినట్లయితే పైరు కిందపడినా నీటిలో తడవకుండా ఉంటుందన్నారు.. అంతేకాక ఈ విధంలో యంత్రం ద్వారా కోత కూడాసరిగా చేసుకోవచ్చన్నారు..ఇక బిపిటి 5204 రకం కోత దశలో ఉన ్నట్లయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొలకలు రాకుండా అలాగే రంగు మారకుండా ఉండడానికి లీటర్ నీటికి ఒక మి.మి ప్రొపి కొనజల్ లేదా లీటర్ నీటికి ఒక గ్రామ్ కార్బెండజీం తెగులుమందును పిచికారి చేయాలని తెలిపారు.. అనంతరం నీటి మునిగిన వరి పైరు వివరాలను ప్రాథమిక నివేధిక తయారు చేసిఉన ్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు..ముఖ్యంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రభుత్వ మద్దతు ధరతో పతికొనుగోలు జరుగుతుందని కార్పొరేషన్‌కి పత్తి విక్రయించాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్‌చేసుకోవాని సూచించారు.. ఎక్కడైనా పంట నష్టం వాటిల్లనట్లయితే వెంటనే సంబందిత రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియ జేయాలన్నారు..వీరితో పాటు వ్యవసాయ సిబ్బంది హనుమంతు నాయక్, మధు, రైతులు పాల్గొన్నారు..

## వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్లను విడుదల చేసిన నాయకులు



**పత్తికొండ, అక్టోబరు 25,ప్రభాతవార్త:** నియోజకవర్గం కేంద్రంలోని పత్తికొండలో మాజీఎమ్మెల్యే శ్రీదేవమ్మ స్వగృహంలో శనివారం మండల వైయస్సార్సిపి నాయకులు ఈ నెల 28న జరిగే ప్రజా ఉద్యమం పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు మాజీ ఎమ్మెల్యే ఆధవ్యంలో నిర్వహిస్తున్న ర్యాలీలో వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపిపి నారాయణదాసు పిలుపు నిచ్చారు. ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ విజయవంతంగా కొనసాగుతుందన్నారు..ఈ ప్రజా ఉద్యమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అబిమానులు, అనుభంధ విభాగాల అధ్యక్షులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన తెలిపారు. మాజీ సర్పంచ్ సోమశేఖర్, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టరు దేవన్న, హొసూరు శ్రీనువాసులు, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

## అధిక వర్షాలకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఏవో సూచన



**వెలుగోడు,అక్టోబరు 25,ప్రభాతవార్త:** మండల పరిదిలో అధిక వర్షాల నుండి పంటను కాపాడుకోవడానికి మొక్కజొన్న పంట కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవశాఖ అధికారి స్వాతి తెలిపారు.. శనివారం ఆమె వరి పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. పొలాలలో నిల్వ ఉన్న అధిక నీటిని చిన్నచిన్న రాలువల ద్వారా బయటికి తీసి వేయాలి, అఅధిక వర్షాలకు కింద పడిన వరి పంటను కట్టలు కట్టుకోవాలి, గింజ గట్టి పడిన వరి పంట పైప మొలకులు కాకుండా 2శాతం ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేసుకోవాలి, ఇతర దశలలో ఉన్న వరి పొలాలలకు ఇప్పుడు ఉన్న వాతావరణ కారణంగా ఎక్కువగా మచ్చ తెగుళ్ల వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నది కాబట్టి రైతులందరు ఒక ఎకరాకు జీవ శిలీంధ్ర నాశనులైన 1 కేజీ సుడోమోనాస్ మరియు 500 గ్రాములు ట్రైకోడెర్మా విరిడి కలిపి పిచికారి చేయయడం వలన మచ్చ తెగుళ్ళుతగ్గే అవకాశం ఉంది. అని ఆమె తెలిపారు. సుడోమోనాస్ మరియు ట్రైకోడెర్మా విరిడి ప్రతి ఒక రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిపి వేయాలి



**తుగ్గలి, అక్టోబరు 25, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిలిపివేయాలని వైయస్సార్సిపి పార్టీ సీనియర్ నాయకులు తుగ్గలి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మైనార్టీ నాయకులు టీఎండి హుస్సేన్, యువ నాయకుడు తుగ్గలి మోహన్‌రెడ్డి, ఎంపిపి గౌరవ సలహాదారుడు హనుమంతు అన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలోని తుగ్గలి శ్రీనివాసులురెడ్డి స్వగృహంలో పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 28న నియోజకవర్గంలో ప్రజా ఉద్యమం పేరుతో నిర్వహించనున్న కార్యక్రమానికి వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. అలాగే పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు పూనుకొని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందకుండా కుట్ర చేస్తున్నారని వారు మండిపడ్డారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. అలాగే మండలంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ నాయకత్వంలో విజయవతంగా పూర్తి చేస్తామన్నారు. రామచంద్రారెడ్డి, రాతన మోహన్‌రెడ్డి, ఎంపిటిసి రాజు, కో-ఆప్సన్‌మెంబరు చాంద్‌బాష, విష్ణువర్ధన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆదోనివాసికి గౌరవ డాక్టరేట్ ప్రదానం

**- డాక్టరేట్ అందుకున్న బూదూరు శ్రీనివాస్ - హర్షం వ్యక్తం చేసిన బంధువులు, సన్నిహితులు**



**ఆదోనిలీగల్, అక్టోబరు 25, ప్రభాతవార్త;** ఆదోని పట్టణానికి చెందిన బూదూరు శ్రీనివాస్‌కి అరుదైన గౌరవ డాక్టరేట్‌ను తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు నగరంలో ఐటీసీ ఫార్చూన్ హోటల్‌లో అతిరథ మహారథుల సమక్షంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు శనివారం అందించారు. ఆదోని పట్టణానికి చెందిన బూదూరు శ్రీనివాస్ అఖిల భారత పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్‌లో అఖిల భారత పాఠశాలల పేరెంట్స్ అసోసియేషనన్ఆంధ్ర రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పని చేస్తూ దాదాపుగా 8 సంవత్సరాలుగా అఖిల భారత పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు గౌరవనీయులు పిల్లా చంద్రంగారి ఆదేశాల మేరకు పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించిన గురుకుల పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఆయా సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న విద్యా సమస్యలపై, మౌలిక వసతులపై పోరాడడం జరిగింది. పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నందుకు గతంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అవార్డు, మహాత్మా జ్యోతిరావుపూలే అవార్డు, మదర్ థెరిస్సా అవార్డు, సావిత్రిభాయిపూలే అవార్డు, యుద్ధ నౌక గద్దర్ అవార్డు, ఏపీజే అబ్దుల్‌కలాం అవార్డు ఇలా అనేక అవార్డులు అందుకోవడంతో తమిళనాడు రాష్ట్రంలోని హోసూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం జరిగిందని అవార్డు గ్రహీత తెలిపారు. అలాగే ఈ డాక్టరేట్ రావడంతో మరింత బాధ్యత పెరిగిందని, నాకు సహకరిస్తున్న అఖిల భారత పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు పిల్లా చంద్రంకు, బంధువులు, స్నేహితులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కోడుమూరు విద్యార్థి ఎంపిక




**కోడుమూరు,అక్టోబర్ 25, ప్రభాతవార్త :** కోడుమూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల్లో పదవతరగతి చదువుతున్న జగన్‌మోహన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రుడు తెలిపారు. ఈ నెల 22వ తేదిన కర్నూలులో జరిగిన అండర్ 17 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థి అత్యంత ప్రతిభా పాటవాలను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్ని చెప్పారు. ఇదే చొరవ రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా చూపి కోడుమూరు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశాబావం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల ఎంపికకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సురేంద్ర నాయుడు,కె.జె కిశోర్లను, విద్యార్థి జగన్‌మోహన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రుడు,నాన్‌టీచింగ్ స్టాఫ్ గాజుల క్రిష్ణమోహన్‌లు అభినందించారు. ఈ విద్యార్థి 30వ తేదిన రాజమండ్రి జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

# కుండ పోత వర్షం.. నీటి మునిగిన పంటలు

: ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు
: లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం
: నీట మునిగిన అర్టిసి బస్టాండు



**నంద్యాల, అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి :** బంగాళాఖాతంలో ఏర్పడిన అలపపీడనము వాయుగుండముగా మారి గత రెండు రోజుల నుండి రాష్ట్రాన్ని అతలాకుతలము చేస్తుంది. శుక్రవారము రాత్రినుండి శనివారము తెల్లవారు వరకు కుండ పోతగా వర్షము కురువడముతోకోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. కుందూ నది అనుసందానముగా సాగు చేసి వరిపై పైరు మొత్తం నీట మునిగింది. మండల పరిదిలోని గుల్లదుర్తి, భీమునిపాడు, కోవెలకుంట్లయల్‌యంకాంపొందు డొంకరస్త సంత పేట బస్టాండు సాయినగరు నీటి మనిగాయి. ఈకాలనీల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి నిత్యవసర వస్తులు వర్షం పాలు అయ్యాయి. ఈక అర్టిసి బస్టాండు గురించి చెప్పనక్కర లేదు. బస్టాండు, డిపోలోకి వరద నీరు చేరడముతో కార్మికులు నానా యాతనలు పడి వాటిని బయటకు పంపారు. ముఖ్యంగా గుల్లదుర్తి , దోరాశి,





యంగోవిందిన్నె, లింగాల, వల్లంపాడు, కంపమల్ల, క్రిష్టిపాడు,మయలూరు, నర్శిపల్లె, సుద్దమల్ల, రూపనగుడి గ్రామల్లో రైతులు కుందూ నది అనుసందానముగా సాగు చేసిన వరిపంట మొత్తం నీట మునిగింది.ప్రస్తుతము వరిపై వెన్ను దశ ఉండటముతో రైతులు లబోదిబో అంటున్నారు. అలాగే కుందూ ప్రవాహము పాలేరు రెండు కలువడముతోఅర్‌అండ్ బి రోడ్డు కోతకు గురి అయింది. దీనితో జమ్మలమడుగు,కోవెలకుంట్ల మద్యహ్నాము వరకు రాక పోకలు నిలిచి పోయాయి.

# వైద్యులు తమ తమ నైపుణ్యాన్ని నిరంతరం అందిపుచ్చుకోవాలి

**కర్నూల్ హాస్పిటల్ అక్టోబర్ 25ప్రభాతవార్త :** అనస్థీషియాలో ఆల్ట్రాసౌండ్ ఆధునిక స్కిల్స్ పై అప్ డేషన్".. "కె.యం.సి అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో పోకస్ ప్లస్ 2025 హాండ్స్ ఆన్ ట్రైనింగ్"... "వైద్యులు తమ నైపుణ్యాలనునిరంతరం ఆధునికరించు కోవాలి"... అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ. వైద్యులు ఆధునిక ఆవిష్కరణలను అందిపుచ్చుకొని తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకో వాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ అన్నారు. శనివారం కర్నూల్ మెడికల్ కాలేజీ యందలి మోర్టాన్ స్కిల్ ల్యాబ్ యందు అనస్థీషియాలజి, కర్నూల్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల హాండ్స్ అన్ ట్రైనింగ్ "పోకస్ ప్లస్ 2025 ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వైద్యుడు నిత్య విద్యార్థి అని వైద్య రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం ద్వారా




మరింత మెరుగుగా కచ్చితత్వంతో రోగులకు వైద్య సేవలు అందించవచ్చునని ఆమె అన్నారు. అడిషనల్ డి.యం.ఈ సర్వజన వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య రంగలో అనస్థీషియా విభాగపు ప్రాధా న్యత వెలకట్టలేనిది అని ప్రతి సర్జరీ అనస్థీ షియా వైద్యల సహకారం తోనే జరుగుతుంది అని అన్నారు. అల్ట్రా సౌండ్ సహకారంతో ఖచ్చితమైన ప్రదేశంలో రోగికి మొత్తు అందించడం ద్వారా సురక్షితమైన సర్జరీకి మార్గం ఏర్పడుతుంది అని అన్నారు. ఈ రెండు రోజుల హాండ్స్ ఆన్ శిక్షణలో లంగ్ ఎయిర్ వే యు.ఎస్.జి , ఫ్లూయిడ్ రెస్పాన్సివ్నెస్, అప్పర్ లోయర్ లింబ్స్, ట్రన్కాల్ బ్లాక్స్, టి.టి.ఇ మొదలగు అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన అనస్థీషియా వైదులకి నిపుణులు శిక్షణ ఇచ్చి వారిచే చేయిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనస్థీషి యా విభాగపు అధిపతి,ఛైర్మెన్ డా. విశాల, వైస్ ఛైర్మన్ డాక్టర్ రామ్ శివ నాయక్, సెక్రటరీ జయదేవ్ రాథోడ్, ఏపి.యం.సి అబ్జర్వర్ ఫార్మకాలజి విభాగాధిపతి డాక్టర్ రాజేష్, కర్నూల్ సొసైటీ ఆఫ్ అనస్థీషియా ప్రెసిడెంట్ డా.సుదీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిమెంట్ రోడ్డు కు భూమి పూజ

**ఎమ్మెల్యే పార్థసారథి.**

**ఆదోని అక్టోబర్ 25 ప్రభాతవార్త :** ఆదోని పట్టణంలోని ఏడవ వార్డు కొనిముల్ల ఏరియాలో సీసీ రోడ్డు నిర్మాణమునకు ఎనిమిది లక్షల తోపాటు రెండు లక్షలతో డ్రైనేజీ పనులకు శనివారం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదోని ప్రజలకు శుభవార్త కేంద్ర ప్రభుత్వం డైరెక్టుగా మున్సిపాలిటీలో జమ చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు ఐదు కోట్ల 80 లక్షలు ఆదోని మునిసిపాలిటీకి విడుదల అయ్యాయని దీని ద్వారా పట్టణంలోని సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఏర్పడిందని అన్నారు, ఈ గ్రాంట్ ను రెండు రకాలుగా విభజించి టైడ్ గ్రాంట్ కింద మూడు కోట్ల 48 లక్షల రూపాయలను త్రాగునీటి వసతి (ఇంటింటి కొళాయి) కోసం ఖర్చు చేయడం జరుగుతుందని, అలాగే రెండు కోట్ల 32 లక్షల రూపాయలను రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ కోసం ఖర్చు చేయడం జరుగుతుంది కాబట్టి రాబోయే మూడు నెలల్లో ఆదోనిలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతాయని ఇది శుభసూచకం అని తెలియజేశారు. కార్యక్రమం లో మునిసిపాల్ చైర్మన్ లోకేశ్వరి ,వైస్ చైర్మన్ గౌస్,నరసింహాలు మునిసిపాల్ ఇంజినీర్ సత్య నారాయణ, కౌన్సిలర్లు,టీడీపీ,బీజేపీ నాయకులు పాల్గొన్నారు

# వర్షాలతో మురుగుతున్న.. ఆత్మకూరు పురపాలక సంఘం

**: దోమలతో, దుర్వాసన మద్యలో జీవనం కొనసాగిస్తున్న పట్టణ ప్రజలు**



**ఆత్మకూరు, అక్టోబర్25, ప్రభాతవార్త:** అరకొర చినుకులతో పురపాలక సంఘంలో పారిశుద్ధ్య పనులు లోపించడంతో వార్డులలో దుర్వాసన వెదజలి దోమకాటుకు గురవడం పట్టణ ప్రజలకు తప్పడం లేదు. ఏ వార్డులో చూసిన ఆపరిశుభ్రంగా దర్శనం ఇస్తున్నాయి. కేవలం ప్రధాన రహదారిపైనే పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేపిస్తున్నారే తప్పా 24వార్డులలో నెలకొన్న సమస్యలపై అధికార యంత్రాంగం లోపిస్తున్న పారిశుద్ధ్య పనులు అని చెప్పవచ్చు. భారీ వర్షాలతో డ్రైనేజి కాల్వలో మురుగునీరు వెల్లక ఇళ్ల మద్యలోనే దుర్వాసన వెదజల్లి మురుగునీటిలోనే జీవనం కొనసాగిస్తున్న పట్టణ ప్రజల దుస్తితి అని చెప్పవచ్చు. పట్టణంలో అభివృద్ధి, మౌళిక సదుపాయాల పేరుతో లోన లోటరం, పైన పటారం అనే చందంగా మారిందని చెప్పవచ్చు. ఒకవైపు దుర్వాసన వెదజల్లుతున్న డ్రైనేజి కాల్వలో పూడిక తీత పనులు అడ్డుగా ఉండంతో రోడ్లపై మురుగునీరుతో దుర్వాసన రావడం జరుగుతుంది. కనీసం బ్లీచింగ్ పొడర్ చల్లె విదంగా చొరవ తీసుకోవడం లేదు. నామకవాస్తిగా రోడ్లపై సున్నం చల్లుతున్నారే తప్పా వార్డులలో ప్రజలకు కావాల్సిన ప్రదేశంలో బ్లీచింగ్ పొడర్ కనిపించడం లేదు. పారిశుద్ధ్య పనులు లోపించడంలో పట్టణంలో పలు ప్రాంతాలలో రోడ్లపై చెత్తచేదారం డ్రైనేజి మురుగునీరు నిల్వ ఉండడంతో మురుగుతున్న ఆత్మకూరు పురపాలక సంఘం ప్రజలు



విమర్శిస్తున్నారు. ప్రజలు తుతు మంత్రంగా పనులు చేపడుతున్నారే తప్పా సందు సందులో తిరిగి డ్రైనేజి కాల్వలను పరిశీలన చేసే స్థితిలో పురపాలక అధికారులు లేరని చెప్పవచ్చు. వర్షాలు పడుతునే నేపధ్యంలో పట్టణంలో పలు వార్డులలో దుర్వాసనతో జీవనం కొనసాగిస్తున్నారు. ఏదిఏమైనప్పటికి జిల్లా అధికారులు వార్డులలో బ్లీచింగ్ పొడర్ చల్లె విదంగా పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

## బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి గుర్తింపుకు డిఎన్ఎ పరీక్షలు

**కర్నూలు, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా చెట్లమల్లాపురం సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదంలో మృతి చెందిన 19 మంది ప్రయాణికుల శరీరాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో అధికారులు డిఎన్ఎ పరీక్షల ద్వారా గుర్తింపునకు చర్యలు ప్రారంభించారు.కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నిపుణుల బృందం శుక్రవారం రాత్రి వరకు మృతదేహాల నుండి అవసరమైన భాగాలను సేకరించి విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అదే సమయంలో, మృతుల కుటుంబ సభ్యులలో 16 కుటుంబాల నుండి వారి రక్త నమూనాలను తీసి, సరిపోల్చేందుకు పంపించినట్లు వైద్యాధికారులు తెలిపారు.డిఎన్ఎ పరీక్షల ఫలితాలు రావడానికి సుమారు 48 గంటల సమయం పడుతుందని, రిపోర్టులు అందిన వెంటనే ప్రతి మృతదేహాన్ని సంబంధిత బంధువులకు అప్పగించే ప్రక్రియ చేపడతామని అధికారులు పేర్కొన్నారు..

## కలగొట్ల, మల్కాపురంలో రచ్చబండ కార్యక్రమం.

**: మెడికల్ కళాశాలకు ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ.**



**ఎమ్మిగనూరు రూరల్ అక్టోబర్ 25 ప్రభాతవార్త:** మండలంలోని కలగొట్ల మల్కాపురం గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించిన వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుట్ట రేణుక, సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, మురహర రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కలగొట్ల మల్కాపురం గ్రామంలో ప్రజల సమక్షంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కూటమి ప్రవృతం చేస్తున్న మోసాలను ఎండగట్టి,పేద విద్యార్థులు ఎంబిబిఎస్ చేయాలంటే కోట్లు అయ్యే ఖర్చును మాజీ ముఖ్యమంత్రి మన జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలో తీసుకురావడం జరిగింది. ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం ఈ మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణ చేస్తే సామాన్య విద్యార్థులు డాక్టర్ కావాలన్నా కల కలగానే మిగిలిపోతుందని వారు అన్నారు. కాబట్టి ఈ కూటమి ప్రభుత్వాన్ని మెడలు వంచి, కోటి సంతకాలు చేసి గవర్నర్ కి పంపి రేపు 28న జరిగే ర్యాలీలు ధర్నాలు నిర్వహించి మెడికల్ కళాశాల ప్రైవేటుకను అడ్డుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి మండల కన్వీనర్ బసిరెడ్డి, మండల అధ్యక్షులు కేశన్న, యువజన అధ్యక్షులు డి నజీర్ అహ్మద్, కలగట్ల సర్పంచ్ అబ్రహం, మల్కాపురం సర్పంచ్ దేవేంద్ర గౌడ్, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానందీశ్వరుని సన్నిధిలో జిల్లా ఎస్పీ దంపతులు



**మహానంది, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మహానందీశ్వరుని సన్నిధిలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ దంపతులు పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం స్వామివారి దర్శనార్థమై వచ్చిన వారికి ఆలయ ముఖమండపం వద్ద ఆలయ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అనవాయితీ ప్రకారం వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర్‌శర్మ, హనుమంతు శర్మ, రాఘవ శర్మ వేదమంత్రోచ్చరణ మధ్య స్వామివారి చిత్రపటాన్ని అందించి వేదాశీర్వచనం మధ్య స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం నాగులకట్ట వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. వారి వెంట ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి, పోలీసులు వున్నారు.

# వెల్దుర్తిమండలాన్ని పట్టి పీడిస్తున్న.. డెంగీ జ్వరాలు..!

**- అదుపులోకి రావా అంటున్న మండల ప్రజలు.. నిర్లక్ష్యం ఎవరిది?**
**- పారిశుధ్యపనులు చేయడం లేదా..? సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైన వైనం..**

**వెల్దుర్తి, అక్టోబర్25, ప్రభాతవార్త** వెల్దుర్తి మండలాన్ని డెంగీ జ్వరాలు పట్టి పీడిస్తు న్నాయి. నిర్లక్ష్యం ఎవరిది,ఈ విష జ్వరాలు అదుపులోకి రావా అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.దోమలు ప్రబలే ఈ జ్వరాలు వస్తున్నట్లు వైద్యులు తెలుపుతున్నారు.మరి పారి శుధ్యపనులు చేయడం లేదా,సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువయ్యిందా అనేది జిల్లా అధికారులే గ్రహించాలి.గత రెండు రోజుల్లో వెల్దుర్తి సిహెచ్‌సిలో వెల్దుర్తి, అల్లుగుండు, ఎస్.బోయినపల్లి, కొంగనపాడు గ్రామాలకు చెందిన వారు దాదాపుగా 8 మంది డెంగీ జ్వరాలతో అల్లాడుతున్నారు.మండలంలోని అల్లు గుండు గ్రామానికి చెందిన అఖిల్,అభిరాం, కొంగనపాడుకు చెందిన 7 సంవత్సరాల చిన్నారి కీర్తన,ఎస్.బోయినపల్లిలో 11 సంవత్సరాల ప్రేమదివ్య శనివారం వెల్దుర్తి సిహెచ్‌సిలో జ్వరంతో అల్లాడుతూ చేరారు.వీరికి సైతం డెంగీ జ్వరం నిర్థారణ అయ్యింది.వెల్దుర్తి పట్టణానికి చెందిన 13వ వార్డుకు చెందిన గ్రామకార్యదర్శి నరేష్‌కు నాలుగురోజులుగా జ్వరం రాగా శుక్రవారం డెంగీ జ్వరం అని తేలింది.వెల్దుర్తిలోనే 6వ వార్డు విద్యశ్రీ అనే శ్రీ విదా ్యనికతన్ పాఠశాల విద్యార్థినీకి,15వ వార్డుకు చెందిన షకూర్‌బాష స్థానిక సిహెచ్‌సిలో చేరి వైద్యపరీక్షలు చేయించుకోగా డెంగీ జ్వరం వచ్చినట్లు వైద్యులు తెలిపారన్నారు.వీరు ప్రస్తుతం అక్కడే వైద్యసేవలు పొందుతున్నారు.మండల కేంద్రమైన వెల్దుర్తిలో సైతం పాతబస్టాండ్‌లో కూరగాయల మార్కెట్ సమీపంలో బస్‌షెల్టర్ వెనుక తోపుడు బండ్లు, షాపులు,హోటళ్లవారు అక్కడ చెత్తవేయడం జరుగుతుంది.ఇటీవల కురుస్తున్న వర్షాలకు అక్కడ దుర్వాసన వస్తుంది.బస్సులకోసం నిలుస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దోమలు మరింత పెరిగిపోతున్నాయి. పోలీస్‌స్టేషన్ సమీపంలో పోలీస్‌క్వార్టర్స్ వద్ద కాలువ నిండు కుండలా తయారయ్యింది.క్వార్టర్స్ దగ్గరలోనే ఎంపిపిఎస్ మెయిన్ పాఠశాల ఉంది.ఇక డోన్ వైపున కుడివైపుకు మురికికాల్వలు లేకపోవడంతో కుంటల్లో నీరు నిల్వ ఉండి దోమలు ప్రబలుతున్నాయి.రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయడం లేదని,మురికికాల్వలలో పిచికారి చేయడం లేదని ప్రజలు వాపోయారు.గత 3 నెలల నుంచి ఈ డెంగీ జ్వరాలు ప్రజలను వదలడం లేదు.ఈ డెంగీ జ్వరంతోనే వెల్దుర్తి పట్టణానికి చెందిన 7 ఏళ్ల చిన్నారి మోక్షిత ముందుగా వెల్దుర్తి ఆసుపత్రిలో చేరి తర్వాత కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి







తరలించారు.అక్కడ కోలుకోలేక ఆగస్టు 25న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలింది. మున్ముందు తగు జాగ్రత్తలు పాటించకపోతే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో ప్రజల ప్రాణాలకు రక్షణ ఏది అని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు.

## హాస్టళ్ళలో విద్యార్థుల సంఖ్య పెరగాలి - ఎమ్మెల్యే

**నందికొట్కూరు,అక్టోబరు 25,ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని సంక్షేమ వసతి గృహాలలో(హాస్టళ్ళ) విద్యార్థుల సంఖ్య బాగా పెరగాలని నియోజకవర్గం శాసనసభ్యులు గిత్తా జయసూర్య అన్నారు. శనివారం స్తానిక మార్కెట్ యార్డులో వపతి గృహాల సంక్షేమ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్ర కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగమే హాస్టళ్ళలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు అన్ని వసతి గృహాల మౌళిక వసతుల కోసం నిధులు కేటాయిస్తున్నదని, అధికారులు కూడా తమ వంతుగా హాస్టళ్ళలో విద్యార్థుల శాతం పెంచేదుకు ప్రణాళిక తో ముందుకు వెళ్ళాలని, హాస్టళ్ళలో ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారించేందుకు కృషి చేస్తానని త్వరలోనే అన్ని హాస్టళ్ళను తనిఖీ చేస్తానని అందరు విధులపట్ల అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో హాస్టళ్ళ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఖచ్చితమైన.. నిబందనలు పాటించాలి

**నంద్యాల,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి** ంప్రభుత్వం ప్రవేటు అసుపత్రులు ల్యాబ్‌లు క్లినిక్‌లు మరియు డయాగ్నస్టిక్ సెంటర్లు బయో మోడికల్ వ్యర్థాల నిర్వహణలో అంద్రప్రదేవ్ కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నిబందనలను ఖచ్చిత్తంగాఅమలు చేయలని జిల్లా కలెక్టరు రాజకుమారి సంబందిత అదికారులను అదేశించారు. శనివారము కలెక్టరేట్లఓ తన చాంబరులో కాలుష్య నియంత్రణ చర్యలపై సంబందిత అదికారులతె కలెక్టరు సమీక్షించారు.ఈసందర్భముగా అమె మాట్లాడుతూ పర్యావరణ పరరక్షణ ప్రతి ఒక్కరి బాద్యత అని చెప్పారు. అసుపత్రులు బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో చట్టపరమైన నిబందనలు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సంబందిత అదికారులను అదేశించారు. రోగులు సిబ్బంది మరియు ప్రజల అరోగ్య భద్రత దృష్ట్యా వైద్యవ్యర్థాలను సక్రమంగదా వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో నిర్వర్తించాలని అమె సూచించారు.అసుపత్రుల్లో కాలం చెల్లిన మందులను సక్రమంగా ద్వంసము చేయడము తప్పనిసిరి అని స్పష్టము చేశారు. అటువంటి మందులను సాదారన చెత్తతో కలిసి పారబోసినట్లయితే పార్యవరణానికి ప్రజా అరోగ్యానికి త్వీ ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. అలాగే అసుపత్రులు చెత్తను సరైన విదముగా వేరు చేయడము అత్యవసరమని చెప్పారు. రేడ్ యెల్లో బ్లూ వైట్ రంగుల బయో కోడింగు బ్యాగులు ఉపయోగించి ఇంజెక్షన్ సూదులు పత్తి గ్లోఫ్స్ శరీర వ్యర్థాలు వంటి బయో మెడికల్ వ్యర్థాలనే వేర్వేరు సంచుల్లో వేరు చేయాలని సూచించారు. ఇది వ్యార్తాల శాస్త్రీయ నిర్వహణకు కీలకమని అమె చెప్పారు. క్లీనిక్ ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే బయో మెడికల్ వ్యర్థాల వివరాలను ప్రతి రోజులు డేటా ఎంట్రీ చేయడము తప్పనిసరి అని కలెక్టరు చెప్పారు. డేటి ఎంట్రీ చేయని సంస్థలపై కాలుష్య నియంత్రణ మండి చర్యలు తీసుకోవాలని అమె సంబందిత అదికారులను అదేశించారు.



# బస్సు ప్రమాద మృతులకి సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్యాండిల్ తో అశ్రునివాళి

**: ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలి**
**: మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి**

**కర్నూలు అక్టోబర్ 25 ప్రభాతవార్త ప్రతినిధి :** కర్నూలు సమీపంలో చిన్నటేకూరు దగ్గర జరిగిన బస్సు ప్రమాద సంఘటన మృతి చెందిన వారికి సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం క్యాండిల్ వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమానికి సిపిఐ కర్నూల్ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా సహాయ కార్య దర్శి ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబు, మాటా ్లడుతూ హైదరాబాదు నుండి బెంగళూరుకు పోతున్న కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు సమీపంలో చిన్నటేకూరు దగ్గర తెల్లవారుజామున 3 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 19 మంది మరియు బస్సు ఢీ కొట్టిన మోటార్ సైకిల్ పై వెళుతున్న ఒక వ్యక్తి (మొత్తం 20 మంది) మరణించడం చాల బాధాకరమని సిపిఐ




తరపున తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు మృతులకు క్యాండిల్స్ తో నివాళులర్పిస్తున్నామని ఈ సంఘటన కు డ్రైవర్ నిర్లక్ష్యం తో పాటు రవాణా అధికారుల నిర్లక్ష్యము స్పష్టంగా కనపడుతున్నదని కావేరి ట్రావెల్స్ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘించారని బస్సు రిజిస్ట్రేషన్ ఒరిస్సా రాష్ట్రంలో చేసి తెలంగాణ,ఆంధ్ర,కర్ణాటక రాష్ట్రాలలో బస్సు తిప్పుతున్నారని, బస్సులో స్లీపర్ ఏర్పాటు కు పర్మిషన్ లేకపోయినా ఏర్పాటు చేశారని రవాణా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా మారిందని పూర్తిస్థాయిలో విచారణ చేసి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 1 కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, దెబ్బలు తగిలిన వారికి 5 లక్షలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రమాదంలో మరణించిన వారి మృతికి ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి సి మహేష్, నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, బిసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న నగర కార్యదర్శి అశోక్, ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి శ్రావణి, నగర కార్యదర్శి వి భారతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, సిపిఐ నగర నాయకులు ఈశ్వర్, కృష్ణారెడ్డి, ధనలక్ష్మి,రేణుక, జయమ్మ, ప్రసాదు రాముడు తదితరులు పాల్గొన్నారు

## పులివెందుల తరువాత ఆలూరు నియోజకవర్గంలోనే బలం- ఎమ్మెల్యే

**- మొలగవల్లి గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ**



**ఆలూరు,అక్టోబరు 25,ప్రభాతవార్త:** రాష్ట్రంలో పులివెందుల తరువాత వైయస్సార్సీపికి ఆలూరు నియోజకవర్గంలో ప్రజల మద్దతు బలంగా ఉందని ప్రజలు వరుసగా మూడుసార్లు వైకాపా అభ్యర్థిని గెలిపించారని నియోజకవర్గం శాసనసభ్యులు బూసినే విరుపాక్షి అన్నారు. శనివారం మండల పరిధిలోని మొలగవల్లి గ్రామంలో పార్టీ కేంద్రాలయం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత పెరిగిందని 2029లో రాష్ట్రంలో వై.యస్.జగన్‌మోహాన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్, జడ్పీటిసి, ఎంపిపి, సర్పంచ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా ఉపాధ్యాక్షులు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, వైస్ ఎంపిపిలు, ఎంపిటీసిలు, బి.వి.ఆర్.అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే ర్యాలీ పై కార్యకర్తల సమావేశం

**కర్నూలు అర్బన్ అక్టోబర్ 25 ప్రభాతవార్త** తమ స్వగృహం నందు ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28వ తేదీ మంగళవారం ఉదయం 10. గంటలకు తమ స్వగృహం నుండి కల్లూరు తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి తహసిల్దార్ కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారువైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మెడికల్ కాలేజ్ లను ప్రైవేటీకరణ చేయకూడదని ఎందుకు ఇంత పట్టుదలతో ఉన్నారో మనమంతా ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఎంతో ఉంది.ప్రభుత్వ మెడికల్ కాలేజీలు కేవలం పేద విద్యార్థులు కష్టపడి చదివిన, ప్రభుత్వ సీటు వచ్చే



అవకాశం లేకుండా పోతుందని, మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయకపోతే విద్యార్థులకు చదువుకోవడానికి అవకాశం ఉంటుందనీ తెలిపారు. కూటమి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ ఉండడం చాలా దుర్మార్గపు చర్య, వంకర బుద్ధితో చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నాడనీ అన్నారు.మీ కూటమి ప్రభుత్వానికి చేతనైతే మిగిలిన మెడికల్ కాలేజీలను కూడా పూర్తి చేసి పేద విద్యార్థుల కోసం కాలేజీలను నడపాలనీ ఛాలెంజ్ విసిరినారు. పేద ప్రజలు అందరూ కూడా ఇంగ్లీష్ మీడియం చదవాలని ఉద్దేశంతోనే ప్రభుత్వ స్కూలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డి దే అని తెలిపారు.రాష్ట్ర ప్రజలందరూ కూడా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయకుండా దానికి వ్యతిరేకంగా తెలుగుదేశం ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా 28వ తేదీ జరగబోయే ర్యాలీలో ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నాలని కోరారు..ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం పరిధిలోని వైసిపి అనుబంధ విభాగాల నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.